


SUNDAY SPECIAL

ఎస్వీ జూపార్క్ పులిరాజ్యం





కథనం - మంగళం, ఆంధ్రజ్యోతి

తిరుపతిలోని ఎస్వీ జూపార్క్ పెద్దపులులకు ఆవాసంగా మారుతోంది. అంతరించిపోతోందంటూ ప్రపంచమంతా ఆందోళన చెందుతున్న పెద్దపులుల సంతతి ఇక్కడ మాత్రం వృద్ధి చెందుతోంది. పెద్దపులుల్లోనూ తెల్లపులి తిరుపతి జూపార్క్ రారాజుగా వెలుగొందుతోంది. జూలో ఉన్న 14 పెద్దపులుల్లో 9 తెల్లపులులే కావడం విశేషం. రాజసపు నడకతో దర్పంగా అటూఇటూ తిరుగుతూ సందర్శకులను పులులు ఆకర్షిస్తున్నాయి.

ప్రత్యేక ఆకర్షణ బెంగాల్ టైగర్

పసుపు పచ్చటి శరీరంపై నల్లటి చారలతో.. చురుకైన చూపులతో నింపాదిగా నాదే ఈ రాజ్యం అన్నట్టుగా నడిచే బెంగాల్ టైగర్స్ ఎస్వీ జూపార్క్‌లో రెండు ఉన్నాయి. ఆడ పులి పేరు కమల (14), మగ పులి పేరు సింబ (6). ఆరు నెలల కిందట లక్నో నుంచి తీసుకొచ్చిన ఒక ఆడపులి చనిపోయింది. అలాగే నవంబరు 25న మధు అనే మగ పులి వృద్ధాప్యంతో చనిపోయింది.

ఆత్మకూరు పులి పిల్లల సందడి

తల్లిపులి నుంచి విడిపోయి ఉన్న నాలుగు పులి పిల్లలను కర్నూలు జిల్లా ఆత్మకూరు అటవీ ప్రాంతం నుంచి రెండేళ్ల క్రితం తిరుపతి ఎస్వీ జూపార్క్ తెచ్చారు. వీటిలో ఒకటి అనారోగ్యంతో చనిపోగా మిగిలిన మూడు ఆడ పులి పిల్లలు జూపార్కులో సురక్షితంగా ఉన్నాయి. వీటికి అనంత, హరిణి, విజయ అనే పేర్లు పెట్టారు. అల్లరి ఆటలతో ఇవి సందడిగా తిరుగుతున్నాయి. ప్రస్తుతం వీటి వయస్సు రెండు సంవత్సరాలు.

పూటకు ఆరు కిలోల మాంసం

అడవిలో అంటే వేటాడి కోరిన జంతువును పులి తింటుంది. జూపార్క్‌లో మాత్రం వాటి ఆరోగ్యాన్ని నిరంతరం ఒక డాక్టర్ పర్యవేక్షిస్తూ తగిన ఆహారం సూచిస్తారు. ఉదయం పూట అర లీటరు పాలు, రెండు గుడ్లు, రెండు కేజీల చికెన్ పెడతారు. సాయంత్రం పూట మాత్రం మగ పులికి 6 కిలోల మాంసం (బీఫ్), ఆడ పులికి 5 కిలోల మాంసం పెడతారు.

పెద్దపులిని దత్తత తీసుకోవచ్చు

అంతరించిపోతున్న పెద్ద పులులను కాపాడుకోకపోతే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ప్రపంచమంతా పిలుపునిస్తోంది. ఇందులో మనమూ భాగం కావచ్చు. పులిని దత్తత కూడా తీసుకోవచ్చు. పెద్దపులిని దత్తత తీసుకోవడం అంటే జూపార్క్‌లో వాటికి అయ్యే ఖర్చు భరించడం అన్నమాట. ఒక రోజుకు దత్తత తీసుకుంటే రూ.1,330, వారానికి రూ.9,310, నెలకు రూ.39,900, మూడు నెలలకు రూ.1,19,700, ఆరు నెలలకు రూ.2,39,400, సంవత్సరానికి రూ.4,85,450 చెల్లించాల్సి ఉంటుంది.

తెల్లపులులదే రాజ్యం

ఎస్వీ జూపార్కులో తెల్లపులుల సంతతి పెరుగుతోంది. గతంలో హైదరాబాదు జూ నుంచి ఒక ఆడ తెల్లపులిని, ఒక మగ తెల్ల పులిని ఇక్కడికి తీసుకువచ్చారు. 2018లో వీటికి ఐదు పిల్లలు పుట్టాయి. వీటిలో రెండు చనిపోయాయి. బుడిబుడి నడకలతో మూడు ఇక్కడే పెరిగాయి. వీటికి మళ్లీ నాలుగు పిల్లలు పుట్టి పెద్దవయ్యాయి. ప్రస్తుతం తిరుపతి జూపార్క్‌లో 9 తెల్లపులులున్నాయి. సమీరా, రాణి, కృష్ణ, దేవి, జగన్, దుర్గ, లక్ష్మి, దేవిక.. ఇలా వీటికి పేర్లున్నాయి.

ఉల్లాసంగా..ఉత్సాహంగా

- పండుగలా పేరెంట్-టీచర్స్ సమావేశాలు
- స్వచ్ఛందంగా పాల్గొన్న తల్లిదండ్రులు
- కన్నవారికి ప్రత్యేక పోటీలు...ప్రతిభ చాటిన పిల్లలకు ప్రశంసలు
- హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



తిరుపతి ఎస్‌జీఎస్ హైస్కూల్లో మహిళలకు ముగ్గుల పోటీలు

తిరుపతి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా శనివారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతావరణంలో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలు అట్టహాసంగా జరిగాయి. గతానికి భిన్నంగా తల్లిదండ్రులు ఉత్సాహంగా తరలి వచ్చారు. వారికి ఉపాధ్యాయులు ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ ఛైర్స్ వంటివి, మగవారికి టగ్ ఆఫ్ వార్ వంటి పోటీలు జరిపి గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. గతేడాది టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ప్రస్తుతం చదువుతున్న పిల్లలకు సంబంధించి సమగ్ర వివరాలతో ప్రోగ్రెస్ రిపోర్టులను తల్లిదండ్రులకు అందజేశారు. ఏవైనా సబ్జెక్టులు, క్రీడలు తదితర అంశాల్లో వెనుకబడిన పిల్లల వివరాలు తల్లిదండ్రులకు తెలియజేసి ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిందిగా సూచించారు. ఆపై అంతా కలసి విందు భోజనాలు చేశారు. అచ్చంగా కార్తీక వన భోజనాలను గుర్తుకు తెచ్చిన పేరెంట్స్-టీచర్స్ మెగా మీటింగులతో ప్రభుత్వ పాఠశాలలు సందడిగా మారాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల రాకతో స్కూళ్లకు అదనపు కళ వచ్చినట్టయింది.

అధికారులు, నేతల దృష్టికి సమస్యలు

మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగుల్లో పాల్గొన్న తల్లిదండ్రులు, విద్యార్థులు స్కూళ్లలో సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చారు. పుత్తూరు జడ్పీ బాలికోన్నత పాఠశాలకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సూర్యనారాయణ హాజరు కాగా స్కూల్లో మధ్యాహ్న భోజనం సరిగా లేదని కొందరు తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా మరికొందరు పిల్లలకు ఇస్తున్న కోడిగుడ్డు సైజు చిన్నగా ఉంటోందని ఫిర్యాదు చేశారు. ఆ స్కూల్లో మధ్యాహ్న భోజనం సరిగా లేనందున పిల్లలకు తాను ఇంటి నుంచీ క్యారియర్ పంపిస్తున్నానని గోవిందస్వామి ఫిర్యాదు చేశారు. తడ మండలం ఖాసింగాడు కుప్పం ప్రాథమికోన్నత పాఠశాల సమావేశంలో హైస్కూలు ఏర్పాటు చేయాలని, అదనపు గదులు నిర్మించాలని తల్లిదండ్రులు కోరారు. తిరుపతి నగరం సత్యనారాయణపురం జడ్పీ హైస్కూల్ ప్లస్ విద్యా సంస్థలో సమావేశానికి శాప్ ఛైర్మన్ రవినాయుడు హాజరయ్యారు. ఇంటర్ విద్యార్థులకు బాటనీ, జువాలజీ పుస్తకాలు ఇవ్వలేదని ఓ ఇంటర్ విద్యార్థిని ఫిర్యాదు చేశారు.

తుమ్మలగుంట హైస్కూల్లో హంగామా..

తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట హైస్కూల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు.టపాకాయలు కాల్చి సందడిచేశారు. 2022-23, 2023-24 టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

శ్రీకాళహస్తి మండలం తొండమనాడు జడ్పీ హైస్కూల్లో సమావేశానికి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డీఈవో కె.వెంకటనాగేంద్ర కుమార్ హాజరయ్యారు. రేణిగుంట జడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్లలో సమావేశాలకు జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్ హాజరుకాగా దొరవారిసత్రం మండలం మావిళ్లపాటు మోడల్ స్కూల్ సమావేశానికి సూళ్లూరుపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి అనిల్ కుమార్ వచ్చారు. తిరుపతి ఎంజీఎం స్కూల్లో మున్సిపల్ కమిషనర్ మౌర్య, టీపీపీఎం స్కూల్లో తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ హాజరయ్యారు. తిరుపతి రూరల్ మండలం పద్మావతీపురం జడ్పీ హైస్కూలు సమావేశంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, వెంకటగిరి జడ్పీ బాలికోన్నత పాఠశాల సమావేశంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నారాయణవనం జడ్పీ హైస్కూలు, పిచ్చాటూరు జడ్పీ హైస్కూలు సమావేశాల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. నాయుడుపేట ఎల్ఏ సాగరం జడ్పీ హైస్కూలు సమావేశానికి మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం హాజరు కాగా అక్కడే బాలికల,బాలుర గురుకులాల్లో జరిగిన సమావేశాలకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ హాజరయ్యారు. చిల్లకూరు జడ్పీ ఉన్నత పాఠశాల సమావేశంలో ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు. విద్యను మించిన ఆస్తి లేదని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. తొట్టంబేడు మండలం పెద్దకన్నలి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి మండలం తొండమనాడు పాఠశాలలో టగ్ ఆఫ్ వార్ ఆడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్

హామీ ఇచ్చి మోసం చేశారు..

కోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిన్నెలపూడి ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాల చేస్తామని గూడూరు మాజీ ఎమ్మెల్యే వరప్రసాదరావు హామీ ఇచ్చి మోసం చేశారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. శనివారం పాఠశాలలో హెచ్ఎం చెంగమ్మ ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గ్రామస్థుడు మస్తానయ్య మాట్లాడుతూ పాఠశాల నిర్మాణానికి దివంగత టీడీపీ నేత గండవరం రవీంద్రారెడ్డి ఉచితంగా స్థలం ఇచ్చారని, ప్రభుత్వ నిధులతో పాఠశాలను నిర్మించారన్నారు. 220 మంది విద్యార్థులు ఉండగా పాఠశాల స్థాయిని పెంచుతామని మాజీ ఎమ్మెల్యే మోసం చేశారని తెలిపారు. టీడీపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి ఆయనకు సర్దిచెప్పారు.



మస్తానయ్యకు సర్దిచెబుతున్న టీడీపీ నేత సుష్మారెడ్డి

శభాష్.. మాధవి!

- ప్రభుత్వ బడిలో ఇద్దరు పిల్లల్ని చదివిస్తున్న గెజిటెడ్ అధికారి





ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు పిల్లలతో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ - పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఓ తల్లిగా హాజరైన అధికారి మాధవి

పుత్తూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడిలో పాఠాలు చెప్పే టీచర్లే తమ పిల్లల్ని ప్రయివేటు బడులకు పంపుతున్న రోజుల్లో తన పిల్లలిద్దరినీ ప్రభుత్వ బడిలోనే చదివిస్తున్నారు ఒక ప్రభుత్వ అధికారి. ఆమె పేరు మాధవి. పుత్తూరు రేంజ్ ఫారెస్ట్ అధికారి. పుత్తూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆమె కూతురు ఇందిరాప్రియదర్శిని మూడవ తరగతి, కుమారుడు అనిరుధ్ రెండవ తరగతి చదువుతున్నారు. శనివారం జరిగిన పేరెంట్స్ సమావేశానికి హాజరై తన పిల్లల చదువు తీరుతెన్నుల గురించి టీచర్లను అడిగి ఆమె తెలుసుకున్నారు. కేవలం పేదపిల్లల ఆశ్రయాలుగానే ప్రభుత్వ బడులు మారిపోయిన కాలంలో మీరు మాత్రం ఎలా ఇక్కడ చదివిస్తున్నారు? అని అడిగితే, ప్రభుత్వ ఉద్యోగినైన నేనే నా పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించక పోతే ఎలా? అని ఎదురు ప్రశ్నించారు. "బట్టీపెట్టించే చదువులు నా పిల్లలకు వద్దనుకున్నాను. ఆటుపోట్లను ఎదుర్కొని రాటుదేలేందుకు ప్రభుత్వ బడే మంచి చోటు. అర్హతగల టీచర్లు ఇక్కడ ఉంటారు." అని చెప్పారు.

తింటే.. తాళ్వాయిపాడు వంకాయ తినాలి

పొడుగూ, పొట్టి, తెల్ల, పచ్చ.. అంటూ వంకాయల్లో ఎన్నిరకాలున్నా చారలున్న తాళ్వాయిపాడు వంకాయ రుచికి ఏదీ దీటురాదు. ఎలా వండినా కమ్మగా కరిగిపోయే ఈ వంకాయలకు అందుకే అంత డిమాండ్ ఉంది. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలో శ్రీకాళహస్తి-నాయుడుపేట జాతీయ రహదారి మీద ఉండే ఊరే తాళ్వాయిపాడు.



8

వైభవంగా పుష్పయాగం

శ్రీవారి దేవేరి పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. శనివారం అమ్మవారికి పుష్పయాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని శ్రీకృష్ణముఖ మండపంలో బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి 14 రకాల పుష్పాలు, పత్రాలతో అర్చకులు పుష్పయాగం నయనానందకరంగా నిర్వహించారు.





మునక్కాయలు @ రూ.400

- మిగిలిన కూరగాయలూ రూ.60పైనే

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. శనివారం తిరుపతి ప్రియదర్శిని మార్కెట్లో కిలో మునక్కాయలు రూ.400 పలికాయి. మిగిలిన కూరగాయలు కిలో రూ.60కు పైగా పలికాయి. వర్షాల కారణంగా పంట దెబ్బతినడం, దిగుబడి తగ్గడం, వివాహాలు, అయ్యప్ప స్వాముల సీజన్, కార్తీక మాసం కావడంతో కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో కేజీ కొనేవారు ఇప్పుడు అర్ధ కిలోతో సరిపెట్టుకుంటున్నారు. ఎర్రగడ్డలు కిలో రూ.70, టమోటాలు రూ.60, పందిరి చిక్కుడు రూ.80, బీన్స్ రూ.60, సొరకాయ రూ.70, వంకాయలు రూ.70, గోరుచిక్కుడు రూ.50, బీరకాయ రూ.60 పలుకుతున్నాయి. ఈ క్రమంలో మార్కెట్‌కు వెళ్లే వినియోగదారులు ధరలు చూసి ఉసూరుమంటూ తిరిగి వస్తున్నారు.

చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడును నియమిస్తూ అనంతపురం డీఐజీ షిమోషీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ ఎస్పీగా పనిచేస్తున్న మణికంఠ చందోలు శనివారం నుంచి ఐదు రోజుల పాటు సెలవులో వెళ్లారు. దీంతో తిరుపతి ఎస్పీని ఇన్‌చార్జిగా నియమించారు.

నేడు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

- హాజరుకానున్న 2,553 మంది విద్యార్థులు

తిరుపతి(విద్య), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ - ఎన్ఎంఎంఎస్) ఆదివారం నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా 12 కేంద్రాల్లో నిర్వహించనున్న ఈ పరీక్షకు 2,553 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగనున్నాయి. ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల స్థాయి పిల్లల్లో ప్రతిభా నైపుణ్యాలు వెలికితీసి, వారికి మరింత ప్రోత్సాహాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2008లో జాతీయ ప్రతిభాన్వేషణ ఉపకార వేతన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఏటా నవంబరు లేదా డిసెంబరులో దేశవ్యాప్తంగా పరీక్ష నిర్వహిస్తోంది. 2024-25 సంవత్సరానికిగాను ఆదివారం ఈ పరీక్ష నిర్వహించనున్నారు. మూడుగంటల పాటు నిర్వహించే ఈ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. 90 చొప్పున 180 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ కె.వెంకట నాగేంద్రకుమార్ తెలిపారు. పరీక్ష సమయానికి గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.



బాధితురాలు లావణ్య

నా 'టామీ'ని చంపేశారు!

- పెంపుడు కుక్కను హతమార్చారని పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'నేను ఎంతో ప్రేమగా పెంచుకుంటున్న కుక్క(టామీ)ను చంపేశారు.. నిందితులను కఠినంగా శిక్షించండి' అంటూ ఒక మహిళ తిరుపతి ఈస్ట్ పోలీసులను కోరింది. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ కథనం మేరకు... తిరుపతి శంకర్‌కాలనీలో నివాసమున్న మాజీ వలంటీర్ లావణ్య కొన్నేళ్ళుగా కుక్కలను పెంచుతోంది. రెండు రోజుల క్రితం సొంత పని మీద బయటకు వెళుతూ స్కావెంజర్స్ కాలనీలో కాపురమున్న తన మామ ఆనందయ్య ఇంటి వద్ద వదలి వెళ్లింది. పక్కనే నివాసముంటున్న యువకులు సాయికుమార్, శివకుమార్, వారి బంధువులపై ఆ కుక్క దాడి చేసింది. ఈ క్రమంలో యువకులు ఇంటిలో నుంచి బయటకు వచ్చిన కుక్కను కత్తులు, రాళ్లతో కొట్టి చంపేశారు. విషయం తెలిసిన యజమాని వెంటనే ఈ ఘటనపై ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ప్రచార మాధ్యమాల్లో ఈ విషయం బయటకు పొక్కడంతో ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి కుక్కను హతమార్చిన నిందితులు సాయికుమార్, శివకుమార్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కుక్క కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ వెటర్నరీ కళాశాలకు తరలించారు. ఇదిలావుండగా, పోలీసులు ప్రవర్తించిన తీరు బాధితురాలిని ఆవేదనకు గురిచేసింది. 'మీ కుక్క(టామీ)ను చంపితే కేసు పెట్టడమేంటి.. అసలు దాని తల్లిదండ్రులెవరు.. పుట్టు పూర్వోత్తరాలెమిటో చెప్పండి' అని పోలీసులు వ్యంగ్యంగా ప్రశ్నించడంతో లావణ్య విస్తుపోయారు.

రెవెన్యూ సదస్సులకు 943 అర్జీలు

తిరుపతి కలెక్టరేట్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. రెండవ రోజు శనివారం జిల్లాలో జరిగిన రెవెన్యూ సదస్సులకు వివిధ సమస్యలతో కూడిన దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. తిరుపతి రెవెన్యూ డివిజన్లో 276, శ్రీకాళహస్తి 169, సూళ్లూరుపేట 226, గూడూరు 272 వెరసి మొత్తం 943 అర్జీలు వచ్చాయని, అందులో 11 సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించడం జరిగిందని, మిగిలిన 932అర్జీలను కాల పరిమితి లోపల సంబంధిత అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు.

తరగతి గదులే విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు

పద్మావతిపురం పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పులివర్తి నాని



రామచంద్రాపురంలో ...



చంద్రగిరిలో మాట్లాడుతున్న సీఐ సుబ్బరామిరెడ్డి



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు



పద్మావతిపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజకీయపార్టీలకు అతీతంగా కలసికట్టుగా నియోజకవర్గంలోని స్కూళ్లని అభివృద్ధి చేసుకుందామని.. తరగతి గదులే విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సోమవారం మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లల వికాసానికి టీచర్లు, పేరెంట్స్ కీలక భూమిక పోషించాలని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో విద్యావ్యవస్థని భ్రష్టుపట్టించారని.. దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, విద్యాప్రమాణాలను మెరుగుపరచి 5 స్టార్ రేటింగ్‌లో తీసుకెళ్లే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని వివరించారు. పాఠశాలలో ఆటస్థలం, మరుగుదొడ్లు, ప్రహరీ, వాకింగ్‌ట్రాక్, స్టేజ్, డైనింగ్‌హాల్, కిచెన్‌షెడ్డు, వాటర్‌సంప్, మెయిన్‌గేటు మార్పు వంటి సమస్యలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే విద్యాశాఖ మంత్రి, డీఈవో దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సమస్యలని అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ జ్యోతి, ఎస్ఎంసీ చైర్మన్ రేఖ, డీవైఈవో బాలాజీ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● తుమ్మలగుంట జెడ్పీ హైస్కూల్‌లో మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశాన్ని శనివారం పండుగలా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. టీడీపీ చిత్తూరు పార్లమెంట్ ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో 2022-23, 2023-24 విద్యాసంవత్సరాల్లో పదో తరగతిలో రెండు బ్యాచ్‌లలో తొలిమూడుస్థానాలు సాధించిన ఆరుగురు విద్యార్థులకు నగదు బహుమతి, జ్ఞాపికలను అందించారు. ఎస్ఎంసీ చైర్మన్ కమల, టీడీపీ నేతలు భానుకుమార్‌రెడ్డి, రాధారాయల్, కె.భాస్కర్ రెడ్డి, వరదరాజులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భాకరాపేట: విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తరగతి గదిలో పునాది పడుతుందని ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. శనివారం చిన్నగొట్టిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలతోపాటు మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ సమావేశాలు నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, ఎంఈవో సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు మృదులా దేవి, ఎస్ఐ రాఘవేంద్ర, వార్డెన్ వెంకటేశ్వర రావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కరీముల్లా పాల్గొన్నారు.

రామచంద్రాపురం: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను తల్లిదండ్రుల భాగస్వామ్యంతో అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ మెగా సమావేశాన్ని నిర్వహించారు. కమ్మకండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎస్ఐ రామాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. కుప్పంబాదూరు ఉన్నత పాఠశాలలో ఎంఈవో మార్కండేయులునాయుడు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి చంద్రశేఖర్, టీడీపీ నాయకులు చిన్నబాబు, నీలకంఠ చౌదరి, జేడీ జగన్, బండి విజయకుమార్, సంజీవ హరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎర్రావారిపాలెం: మండలంలోని 46 ప్రాథమిక, 9 ఉన్నత పాఠశాలల్లో శనివారం పేరెంట్స్ .. టీచర్స్ మీటింగ్ సమావేశాలు విజయవంతంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలు, బాలల సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాలలు సంక్రాంతి పండుగ శోభను సంతరించుకొన్నాయి. కేజీబీ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంఈవో బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రతిఒక్కరి సహకారం ఉండాలన్నారు. ప్రిన్సిపాళ్లు పరిమళ, శ్రీదేవి, ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, ముక్కు చంద్ర శేఖర్ రాయల్, కృష్ణప్ప, శ్రీనివాసులు రాయల్, ప్రతాప్, దయాకర్, రవీంద్రనాథ్, కిరణ్ కుమార్‌లతో పాటు ఆయా ఎస్ఎంసీల చైర్మన్లు పాల్గొన్నారు.

చంద్రగిరి: తల్లితండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని, విద్యార్థులు చెడు మార్గాల బాట పడితే వారి భవిష్యత్తు అంధకారమేనని చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి అన్నారు. శనివారం మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పండుగ వాతావరణంలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లు జరిగాయి. చంద్రగిరి బాలికల ఉన్నత పాఠశాలలో సీఐ సుబ్బరామిరెడ్డి మాటా డుతూ విద్యార్థులకు అవసరమైతే తప్ప సెల్ ఫోన్ ఇవ్వరాదన్నారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. చంద్రగిరి సర్పంచ్ రూపారామ్మూర్తి, ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్ బాబు, ఎస్ఐ అనిత, ప్రత్యేకాధికారి సాగర్, ప్రధానో పాధ్యాయులు, టీడీపీ నాయకులు గౌస్‌బాషా పాల్గొన్నారు.

పాకాల: మండలంలోని 69 పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాలు పండుగ వాతావరణంలో నిర్వహించారు. మామిడి తోరణాలు, అరటి చెట్లతో అలంకరించి అందంగా వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. సహపంక్తి భోజనం చేశారు. దామలచెరువు జడ్పీ హైస్కూల్‌లో సమావేశం నిర్వహణకు పాఠశాల పూర్వ విద్యార్థి సోమశేఖర్ నాయుడు రూ.25 వేలు విరాళం అందించారు. జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, సీఐ మద్దయాచారి, ఎంఈవో బాబ్జీ, సర్పంచులు, కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్ల పంపిణీ



పాకాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాఠశాలలో దివంగత ఉపాధ్యాయులు పత్తిపాటి జగన్‌మోహన్‌రావు సంస్మరణ సభను శనివారం ఏర్పాటు చేసి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం ఆయన శిష్యులు పాఠశాలలోని 350 మంది విద్యార్థులకు సుమారు రూ.50 వేలు విలువైన స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. పాఠశాల పూర్వవిద్యార్థి గణేష్‌కు రూ.10,116 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు జగన్‌మోహన్‌రావు, రమేష్ నాయుడు, సురేంద్ర, వరప్రసాద్, మురళీ, చంద్రబాబు, రామకృష్ణ, ఉమర్, షకీలా, శకుంతల, దివ్య, జయశ్రీ, మురళీ, అరుణ్, జగన్‌మోహన్‌రావు సతీమణి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం

పాకాల, డిసెంబరు 7: పాకాల సమీపంలోని ఊట్లవారిపల్లె ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారి జన్మదిన (సుబ్బరాయ షష్ఠి) సందర్భంగా స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం చేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సోంపల్లి చంద్రశేఖర్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎస్.యువరాణి, ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి శర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుప్పంబాదూరు సబ్‌స్టేషన్ తనిఖీ



రామచంద్రాపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పంబాదూరు గ్రామంలోని రాయల చెరువుపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం తిరుపతి ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రనాయుడు తనిఖీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటింగ్ కమిటీ సభ్యులు రామ్‌సింగ్ ఈనెల 14న కుప్పం బాదూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించనున్న నేపథ్యంలో శనివారం ముందస్తుగా పుత్తూరు డీఈ ఆశీర్వాదం, ఏడీ శంకరయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరి పరిశీలించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల ట్రాన్స్‌ఫార్మర్ల లైన్లను మరమ్మతులు చేయాలని ఎస్ఈ సురేంద్రనాయుడు ఆదేశించారు. ఈ సందర్భంగా కుప్పంబాదూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సీకే పల్లి, పరమాల, మిట్టకండ్రిగ, కొత్తకండ్రిగ, బలిజపల్లి, పీవీపురం గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని.. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఏఈ గిరి కోరారు. కార్యక్రమంలో లక్ష్మీపతియాదవ్, వరాలు, వెంకటముని, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీలకు 30 ట్రాక్టర్ల మంజూరు



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి రూరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలోని పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం 30 ట్రాక్టర్లని మంజూరు చేసిందని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. పుదిపట్ల పంచాయతీకి ఎస్సీ కార్పొరేషన్ నిధులు రూ.7 లక్షలతో మంజూరైన మహేంద్ర ట్రాక్టర్‌ని శనివారం సర్పంచ్ బడి సుధాయాదవ్, పంచాయతీ అధికారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నిధులు మంజూరు చేస్తూ పంచాయతీల అభివృద్ధికి అన్ని రకాలుగా తోడ్పాటునందిస్తోందని తెలిపారు. కాగా తిరుపతిరూరల్‌మండలానికి స్వచ్ఛభారత్ నిధులు కింద 16 ట్రాకర్లు మంజూరయ్యాయని, వీటిని ఎమ్మెల్యే ద్వారా పంపిణీ చేశామని ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు.

ట్రాక్టర్ నడిపిన ఎమ్మెల్యే

పంచాయతీకి మంజూరైన ట్రాక్టర్‌ని ఎమ్మెల్యే స్వయంగా నడిపారు. పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలో కూటమి పార్టీ నేతలను ఎక్కించుకుని కొంతసేపు ఉత్సాహంగా డ్రైవింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌తో కలిసి ట్రాక్టర్ డ్రైవర్‌కి తాళాలు అందించారు.

సాంకేతిక సమస్యతో ఆగిన రైలు

పాకాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాకాల - తిరుపతి రైల్వే మార్గం పాకాలలో సిగ్నల్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా రైలు అర్ధగంటపాటు ఆగిపోయింది. మధ్యాహ్నం 2-10 నిమిషాలకు పాకాల రైల్వే స్టేషన్ చేరుకున్న గుంతకల్లు - తిరుపతి ప్యాసింజర్ రైలు అర్ధ గంట అనంతరం రైల్వే అధికారుల అనుమతితో బయలుదేరి వెళ్లింది. రైల్వేగేటు అర్ధ గంట తీయకపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ప్రేమ విఫలమై... యువకుడి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై ఒక యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం స్థానిక అక్కారాంపల్లిలో చోటు చేసుకుంది. అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి కథనం మేరకు... అక్కారాంపల్లిలో కాపురమున్న సిద్ధయ్య తిరుపతిలో వ్యాపారం చేసుకుంటూ ఇద్దరు కుమారులతో కలసి జీవిస్తున్నారు. చిన్న కుమారుడు శశిధర్(28) ప్రైవేటు కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. గత కొంత కాలంగా వివాహం కాలేదని ఆందోళన.. మరోవైపు ప్రేమించిన అమ్మాయి దూరమైందనే ఉద్దేశ్యంతో బతకడం ఇష్టం లేక శనివారం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జరిగిన ఘటనపై మృతుడి తండ్రి సిద్ధయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

శ్రవణం చిన్నారులపై వైసీపీ నిర్దయ దారుణం



సిబ్బందితో మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(విద్య), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పుట్టు మూగ, చెవిటి చిన్నారుల పట్ల గత వైసీపీ ప్రభుత్వం ఎంతో నిర్దయగా వ్యవహరించిందని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక పాత ప్రసూతి ఆసుపత్రి భవనంలో టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రవణం పాఠశాలను భానుప్రకాష్‌రెడ్డి శనివారం సందర్శించారు. పుట్టు మూగ, చెవిటి చిన్నారులతో కాసేపు గడిపారు. ఇంచార్జి తదితర సిబ్బందితో మాట్లాడి అక్కడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... శ్రవణం పాఠశాలలో అనేక సమస్యలను గుర్తించినట్టు చెప్పారు. గత ఐదేళ్ల కాలంలో పుట్టుకతోనే చెవిటి, మూగ అయిన చిన్నారులపై కూడా వైసీపీ ప్రభుత్వానికి ఎందుకంత కక్ష అని ప్రశ్నించారు. ఇక్కడ ఉన్న సమస్యలను టీటీడీ ఛైర్మన్, ఈవో దృష్టికి తీసుకెళ్తానని, ధర్మకర్తల మండలి సమావేశంలో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూ దేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య సేవల్లో భాగంగా ఆలయంలో ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, ఆగమ శాస్త్రోక్తంగా ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ ఆవరణలో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవను కనులపండువగా చేపట్టారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజీ రంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఉద్యోగుల సంఘ ఎన్నికలు

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నాగరాజు, కార్తీక్ గెలుపు



విజయోత్సవంలో ఉద్యోగులు

తిరుపతి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ బోధనేతర ఉద్యోగుల సంఘ ఎన్నికల పోలింగ్ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. తిరుపతి, గన్నవరం కేంద్రంగా రాయలసీమ, కోస్టల్ ఆంధ్రాలలో జరిగిన ఈ ఎన్నికల్లో 166 మంది ఉద్యోగులకు గాను 158 మంది హాజరై ఓటు హక్కుని వినియోగించుకున్నారు. సాయంత్రానికి ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ ముగిసింది. ఈ ఎన్నికల్లో బరిలో నిలిచిన ఉద్యోగుల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సి.నాగరాజు, కె.బాలకార్తీక్‌లు సమీప ప్రత్యర్థులపై గెలుపొందారని అధికారిక సమాచారం. అలాగే కోశాధికారిగా టి.రఘునాథం, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎన్.మురళి, వైస్ ప్రెసిడెంట్‌గా పి.మనోహర్, జాయింట్ సెక్రటరీగా ఆర్.రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.షణ్ముగం, టెక్నికల్ సెక్రటరీగా రవి, కల్చరల్, గేమ్స్ సెక్రటరీగా ఉమాదేవిలు గెలుపొందారని ప్రకటించారు. ద్విముఖ పోరుతో జరిగిన ఎన్నికల్లో అన్ని పోస్టులకు పోటాపోటీగా ఓట్లు వచ్చాయని తెలిసింది. ఈ నేపథ్యంలో తిరుపతిలోని వర్సిటీ కేంద్రంలో పలువురు ఉద్యోగులు సంబరాలు చేసుకుని స్వీట్లు పంచుకున్నారు. కౌంటింగ్ ముగిసేసరికి సాయంత్రం 6.30 గంటలు దాటడంతో తుదిఫలితాలను షీల్డ్ కవర్‌లో భద్రపరచామని, సోమవారం దీన్ని వర్సిటీ రిజిస్ట్రార్‌కి అందిస్తామని రిటర్నింగ్ అధికారి ప్రొఫెసర్ ఆర్.వేణు పేర్కొన్నారు.

సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

తిరుపతి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలోని పంచాయతీల్లో తాగునీరు, డ్రైనేజీ, సీసీరోడ్డు, శానిటేషన్ వంటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కనే వ్యర్థాలను పడేస్తున్నారని ..తొలగింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డీపీవో సుశీలాదేవి, డీఎల్‌పీవో సురేష్‌నాయుడు, ఎంపీడీవో రామచంద్ర, ఈవోపీఆర్డీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు 'వెలుగు పూల కోసం' ఆవిష్కరణ సభ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రమేష్ కుమార్ రాసిన వెలుగు పూల కోసం కవితా సంపుటి ఆవిష్కరణ సభ విశ్వశ్రీ సాహిత్య సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు బైరాగిపట్టెడలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరుగుతుంది. ఇందులో ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, తమటం రామచంద్రారెడ్డి, నాదెండ్ల శ్రీమన్నారాయణ, ఆముదాల మురళి పాల్గొంటారు. మన్నవ గంగాధర ప్రసాద్ అధ్యక్షతన కార్యక్రమం జరుగుతుంది.

16న 'పడమటి గాలి' నాటక ప్రదర్శన



కరపత్రాన్ని విడుదల చేస్తున్న తెలుగు భాషాభిమానులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16వ తేదీన పడమటి గాలి నాటక ప్రదర్శన జరగనుంది. తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో మహతిలో నాటకాన్ని ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని తెలుగు భాషా, సాహిత్యాభిమానులు శనివారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పాటిబండ్ల ఆనందరావు రాసిన పడమటిగాలి నాటకం ఎంతో సంచలనం సృష్టించిందన్నారు. ఈ కార్యక్రమంలో సాకం నాగరాజ, టెంకాయల దామోదరం, తమటం రామచంద్రరెడ్డి, ఆకుల మల్లేశ్వరరావు, గంగవరం శ్రీదేవి, ఆముదాల మురళి, నాదెండ్ల శ్రీమన్నారాయణ, మన్యం నరసింహులు, మోహనమునిసిద్ధారెడ్డి, సుకుమార్, సుభద్ర, చంద్రారెడ్డి, రమేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



తిరుపతి(విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడిని కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బయటి వ్యక్తులు యూనివర్సిటీలోకి రాకుండా చూడాలని, మతవిద్వేషాలకు చోటివ్వకూడదని, యూనివర్సిటీ ప్రతిష్టను కాపాడాలన్నారు. విద్యార్థులు, ఉద్యోగులకు భద్రత కల్పించాలన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంభూపాల్‌రెడ్డి, సిటీ అధ్యక్షులు చిట్టిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహులు, ఎస్సీసెల్ అధ్యక్షుడు శంకర్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున పాల్గొన్నారు.

ఇద్దరు మహిళల అదృశ్యం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇద్దరు మహిళలు అదృశ్యమైన ఘటన శనివారం తిరుపతి రూరల్ మండలం జనార్ధన కాలనీలో చోటు చేసుకుంది. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.... నెల్లూరు జిల్లా బిట్రగుంటకు చెందిన అనిత, కావలి నివాసి శృతిలకు వివాహమైంది. ఇద్దరు మంచి స్నేహితులు. వీరు ఇద్దరూ భర్తలతో విభేదించి తమ తల్లి చిట్టెమ్మ, ఆమె అక్కతో కలసి తిరుపతి రూరల్ మండలం జనార్ధన కాలనీలో ఉంటున్నారు. వీరు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. శనివారం ఇద్దరు తల్లులు పనికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేటప్పటికీ వారిద్దరూ ఇంటిలో కనిపించలేదు. దీనిపై చుట్టుపక్కల వారిని, స్నేహితులను, బంధువులను విచారించినా అంతు చిక్కలేదు. వారు ఎక్కడకు వెళ్లారో తెలియక కంగారు పడ్డారు. దీంతో వారు తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వారు వాడుతున్న మొబైల్ ఫోన్ల ఆధారంగా గాలిస్తున్నట్లు సీఐ చెప్పారు. వీరి ఆచూకీ తెలిసిన వారు వెంటనే సీఐకి చెందిన 94910 74525కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

నకిలీ నెంబరుతో పట్టుబడ్డ జీప్



తిరుమల, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): నకిలీ నెంబరుతో తిరుమలకు వచ్చేందుకు ప్రయత్నించిన ఓ జీపును శనివారం తిరుమల ట్రాఫిక్, ఆర్టీవో విభాగం అధికారులు అలిపిరిలో పట్టుకున్నారు. డ్రైవర్‌తో సహా జీపును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఏపీ 31 టీప 0288 నెంబరు గల జీపు కొందరు ప్రయాణికులతో శనివారం ఉదయం తిరుమలకు వచ్చేందుకు అలిపిరికి చేరుకుంది. ఆసమయంలో వాహనాల తనిఖీల్లో ఉన్న తిరుమల ట్రాఫిక్ పోలీసులు, రవాణా విభాగం అధికారులు జీపును ఆపి పత్రాలను పరిశీలించారు. రవాణా విభాగానికి చెందిన యాప్‌లో జీపు నెంబరు ఎంటర్ చేసి పరిశీలన చేయగా వాహనం యజమాని, డ్రైవర్ల పేర్లు, ఇంజిన్ నెంబరును మరోలా కనిపించాయి. దీంతో జీపులో వచ్చిన డ్రైవర్ జే శ్రీనుని అదుపులోకి తీసుకుని విచారించగా నకిలీ నెంబరుగా తేలింది. దీంతో అతడితో పాటు జీపును అదుపులోకి తీసుకుని తిరుమలకు తీసుకువచ్చారు. సీఐ హరిప్రసాద్ ప్రాథమిక విచారణ చేపట్టిన తర్వాత రవాణా విభాగం అధికారులకు అప్పగించారు.

విద్యుత్ షాక్‌తో వలస కార్మికుడి మృతి



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో వలస కార్మికుడు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ సరస్వతి కథనం మేరకు.. జార్ఖండ్ రాష్ట్రం గిరిద్ జిల్లాకు చెందిన మనోజ్‌తురి(32) బతుకు తెరువు కోసం తిరుపతికి వలస వచ్చాడు. ఇక్కడ దొరికిన పనులు చేసుకుంటూ తోటి స్నేహితులతో కలసి ఉంటున్నాడు. కొర్లగుంటలోని ఒక చికెన్ దుకాణంలో పనిచేస్తూ జార్ఖండ్‌లో ఉంటున్న కుటుంబ సభ్యులను పోషిస్తున్నాడు. శనివారం చికెన్ దుకాణంలో కోళ్ల బ్రాయిలర్‌లో వేసి బయటకు తీస్తుండగా అందులో వున్న నీటికి విద్యుత్ సరఫరా అయింది. కోళ్ల బయటకు తీసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. జరిగిన విషయమై ఈస్ట్ పోలీసులకు చికెన్ దుకాణం యజమాని ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఆదివారం శవ పరీక్షలు పూర్తి చేసి, శవాన్ని బంధువులకు అప్పగిస్తామని ఎస్ఐ చెప్పారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పులివర్తి నాని



పాకాల మండలం పదిపుట్లబైలులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

చంద్రగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని.. గ్రామాల్లో అర్హులకు సంక్షేమ పథకాలు అందలేదని ఫిర్యాదులొస్తే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శనివారం ఎం.కొంగరవారిపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ పథకాలకు ఎందుకు అనర్హులో తెలియజేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి అర్జీకి జవాబుదారీ తనం ఉంటుందన్నారు. ప్రజలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామస్థులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొస్తూ అర్జీలు అందించారు. కార్యక్రమంలో తహశీల్దారు శివరామ సుబ్బయ్య, ఎంపీడీవో శేఖర్, సర్పంచ్ జాగర్లమూడి భారతి, టీడీపీ నాయకులు రమేష్‌రెడ్డి, గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, చెంచయ్యనాయుడు, గాలి సతీష్, వడ్లమూడి దిలీప్, సాగర్, గిరి తదితరులు పాల్గొన్నారు.

● రామచంద్రాపురం: తమ గ్రామంలో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని బ్రాహ్మణకాల్వ గ్రామస్థులు ఆర్డీవో రామ్మోహన్‌ను కోరారు. శనివారం బ్రాహ్మణకాల్వలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గ్రామస్థులు సమస్యలను ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. శ్మశానం స్థలం కబ్జాకు గురైందని వాపోయారు. తమ ఇంటి స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలని కోరగా ఆర్డీవో తహశీల్దారు వెంకటరమణను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, అధికారులు కుమార్, యత్తిరాజులు, లక్ష్మీనారాయణ, సర్వేయర్ రమేష్‌బాబు, వీఆర్వో నరసింహులు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● భాకరాపేట: పట్టాదారు పాసుపుస్తకాలలో తప్పులను సరిదిద్దాలని చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల, దీన్‌దార్లపల్లె గ్రామాల్లో శనివారం జరిగిన రెవెన్యూ గ్రామసభల్లో రైతులు అధికారులకు విన్నవించారు. పలు సమస్యలపై అర్జీలు అందించారు. తహశీల్దారు జనార్ధన్ రాజు, డీటీ వాసుదేవకుమార్, ఆర్ఐ జానకీరామ్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

●పాకాల: మండలంలోని పదిపుట్లబైలు గ్రామంలో శనివారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. వివిధ సమస్యలపై 71 అర్జీలు అందించారు. తహశీల్దార్ నిత్యానందబాబు ఆధ్వర్యంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. డిప్యూటీ తహశీల్దారు సంతోష్‌సాయి, ఆర్ ఎస్ డీటీ కళ్యాణ్, వీర్వోలు, వీఆర్ఏలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● తిరుపతి రూరల్: గత వైసీపీ పాలనలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని.. కూటమి ప్రభుత్వంలో తనతోపాటు అధికారులందరూ ప్రజల ఆస్తులకు రక్షకులుగా పనిచేస్తారని ఎమ్మెల్యే పులివర్తి నాని స్పష్టం చేశారు. పుదిపట్ల పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో సర్పంచ్ బడి సుధాయాదవ్ అధ్యక్షతన శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డిప్యూటీ కలెక్టర్ రోస్‌మండ్, తహసీల్దార్ రామాంజులు నాయక్, ఎంపీడీవో రామచంద్ర, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తు కోసమే విద్యారంగంలో సమూల మార్పులు

శాప్ ఛైర్మన్ రవినాయుడు

తిరుపతి (జీవకోన), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మంత్రి నారా లోకేష్ విద్యారంగంలో సమూల మార్పులు చేస్తున్నట్లు శాప్ ఛైర్మన్ రవినాయుడు అన్నారు. నగర పరిధిలోని సత్యనారాయణపురం (జీవకోన)లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. రవినాయుడు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సమిష్టి కృషితో విద్యారంగంలో మార్పులు తేవడానికి పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను ప్రభుత్వం నిర్వహించిందని తెలిపారు. అలిపిరి సీఐ రామకిషోర్ సైబర్ క్రైమ్, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఇద్దరు వికలాంగ విద్యార్థులకు రూ.10వేల చెక్కును అందించారు. పాఠశాలకు పదివేలు విలువ చేసే క్రీడా వస్తువులను కూడా అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సమావేశం అనంతరం ఛైర్మన్ రవినాయుడు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో 48వ డివిజన్ కార్పొరేటర్ అన్నా అనిత, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, పాఠశాలల హెచ్‌ఎంలు డి.సంధ్యారాణి, పి.శ్రీనివాస్‌యాదవ్, ఎం.నాగరాజనాయుడు, శ్రీరాములు, రవీంద్ర, ఈశ్వర్, మురళి, శివ, లక్ష్మి, శ్యామల, ప్రసన్న, ప్రశాంత్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు, సీఐ రామ్‌కిషోర్

సార్... మాకు పాఠ్యపుస్తకాలు అందలేదు

ఈ సందర్భంగా బైపీసీ చదువుతున్న ఓ విద్యార్థిని తమకు బోటని, జువాలజీ పుస్తకాలు ఇప్పటి వరకు అందలేదని, కొంతమందికే అందించారని తెలియజేశారు. స్పందించిన శాప్ ఛైర్మన్ వెనువెంటనే విద్యాశాఖ ఉన్నత అధికారులకు ఫోన్ చేసి, సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం పాఠశాలలో ఉన్న మరుగుదొడ్లను పరిశీలించారు. సైన్స్‌లో ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులను ఆయన అభినందించారు.

పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

● ఎస్పీ సుబ్బరాయుడు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ - పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని, క్రమశిక్షణతో పెంచాలని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. మంగళంలోని జడ్పీ ఉన్నత (బ్రిండ్స్) పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి హాజరైన ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ.. సైబర్ క్రైం, యాంటీ డ్రగ్స్, మహిళల భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. పిల్లలు బంగారు భవిష్యత్తు కోసం బడి వైపు అడుగులు వేయాలన్నారు. అనంతరం డ్రగ్స్ వద్దని చెప్పే సైబర్ క్రైమ్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయా తరగతుల్లో పేరెంట్స్ సమక్షంలో పిల్లల ప్రోగ్రెస్ కార్డు, హాజరు పట్టిక వంటి వివరాలను తెలియజేశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థుల తల్లులకు రంగవల్లులు, తండ్రులకు తాడు లాగే పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, ట్రైనీ ఐపీఎస్ అధికారి హేమంత్, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులనాయుడు, టీడీపీ నాయకుడు ఈశ్వరయ్య, స్కూల్ కమిటీ ఛైర్‌పర్సన్ షేక్ బాను, ఉపాధ్యాయులు దుర్గాబాయి, జీవరత్నం, వసుంధర, వాసవి, దేవి, కవిత, లావణ్య, కుమారి, ఉషా, యమున, శైలజ, రాణి, రాధ, మదన, మాధవి, నీరజ, వెంకటసులోచన, లక్ష్మీకాంతం, వరలక్ష్మి, శైలజ, కృష్ణమనాయుడు, మనోహర్, చంద్రశేఖరయ్య, విజయసింహారెడ్డి, రామకృష్ణ, వెంకటరమణ, జగన్నాథరావు, గోపీనాథ్, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

టీచర్లతోపాటు తల్లిదండ్రుల పాత్ర కీలకం

కమిషనర్ మౌర్య



విద్యార్థులు, తల్లిదండ్రులతో కమిషనర్ మౌర్య



తిరుపతి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. బైరాగిపట్టెడలోని మహాత్మాగాంధీ మునిసిపల్ స్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో కమిషనర్ పాల్గొని మాట్లాడుతూ ముఖ్యంగా బాలికలు ఎన్ని కష్టాలు వచ్చినా డిగ్రీ వరకు తమ విద్యను ఆపకుండా చదవాలన్నారు. ఈస్కూల్లో డ్రెయినేజీ, మరుగుదొడ్ల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం క్రీడలు, తదితర రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఏడీసీ చరణ్ తేజ రెడ్డి, టీడీపీ నేత శ్రీధర్‌వర్మ, తిరుపతి డివిజన్ విద్యాశాఖాధికారి బాలాజీ, ఎంఈవో భాస్కర్, సీఐ రామకృష్ణ, హెచ్‌ఎంలు రవి, భానుమతి, సీడీపీవో సుధారాణి, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● టీటీడీ స్కూల్లో...

టీటీడీకి చెందిన శ్రీవేంకటేశ్వర ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నేతలు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, సుబ్బు యాదవ్, మనోహరాచారి, జనసేన నేత ఆముదాల వెంకటేష్ తదితరులు పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

● సర్వేపల్లి రాధాకృష్ణన్ స్కూల్లో..

కొర్లగుంటలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నగరపాలక స్కూల్లో జరిగిన పేరెంట్, టీచర్స్‌డేలో డీఎస్పీ శ్రీలత, రాష్ట్ర నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివంలు ముఖ్యఅతిథులుగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు, తల్లిండ్రుడుల పాల్గొన్నారు.



పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చదివించాలి



రంగోలి పోటీలను పర్యవేక్షిస్తున్న హెచ్‌ఎం ధనంజయులు

● సంజయ్‌గాంధీనగర్ పాఠశాలలో

తిరుపతి(విద్య), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):: స్థానిక సంజయ్‌గాంధీ కాలనీలోని నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ధనంజయులు నాయుడు ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం శనివారం పండుగలా జరిగింది. పెద్దసంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ... ప్రజలందరూ తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చదివించాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలియజేశారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులు సంగీత సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమాల్లో తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ లక్ష్మి, వైస్ ఛైర్మన్ శారద, పాఠశాల దాతలు మునస్వామి, గోపాల్, ఆంజయనేయులు, పార్థసారథి, ఉపాధ్యాయులు పద్మావతి, జయప్రకాష్, అనిత, ప్రవీణ, లావణ్య, కవిత, అనిల్‌కుమార్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

● చిన్న బజారు పాఠశాలలో...



మాట్లాడుతున్న సుగుణమ్మ, పాల్గొన్న హెచ్‌ఎం

స్థానిక చిన్నబజారు వీధిలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇంచార్జి మన్నూరు సుగుణమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్‌సీసీ క్యాడెట్లు బ్యాండ్‌తో ఆమెకు స్వాగతం పలికారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి ఆమె సహపంక్తి భోజనం చేశారు.

● గోవిందరాజుస్వామి ఉన్నతపాఠశాలలో

టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న స్థానిక గోవిందరాజుస్వామి ఉన్నతపాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య అధ్యక్షతన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలకు, సెల్‌ఫోన్లకు బానిసలు కాకూడదన్నారు. అనంతరం నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. తాహసున్నీషా బేగం, వి.మునిరత్నంనాయుడు, లత, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

● టీపీపీఎం హైస్కూల్లో

స్థానిక తాతానగర్‌లోని టీపీపీఎం పాఠశాలలో హెచ్‌ఎం ఆనందకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ, పూర్వ విద్యార్థులు, బీజేపీ నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి, సీనియర్ టీడీపీ నేత సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డీఎస్పీ వెంకటనారాయణ మాట్లాడుతూ... తమపిల్లలు చెడు వలలో పడకుండా పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలంటూ సూచించారు. అనంతరం పూర్వ విద్యార్థులు నవీన్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ... పిల్లల సంరక్షణ, పర్యవేక్షణ చాలా అవసరమన్నారు.

కపిలేశ్వర స్వామి ఉన్నత పాఠశాలలో..

తిరుపతి(వైద్యం): తిరుపతి రూరల్ మండలం తాటితోపులోని శ్రీకపిలేశ్వర స్వామి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు సుదర్శన్, నాగేంద్ర, కళావతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో....



తిరుమలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సురేంద్రబాబు

తిరుమల, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమల ఎస్వీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సురేంద్రబాబు, రంగలక్ష్మీ ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం జరిగింది. డీఎస్పీ విజయ్‌శేఖర్, తిరుమల జనసేన నేత మురళి, శ్రీరాఘవేంద్రస్వామి మఠం మేనేజర్ అనిల్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పాఠశాల భవిష్యత్తు ప్రణాళిక, వార్షిక పరీక్షల వివరాలను వెల్లడించారు. డీఎస్పీ విజయ్‌శేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, వారిపై నిరంతరం తల్లిదండ్రుల దృష్టి ఉంచాలన్నారు. సైబర్ నేరాలపై సూచనలు చేశారు. అంతకుముందు ముగ్గులపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం ముందు రోషన్ కనకాల, వైవా హర్ష - ఆలయం ముందు శివరాజ్‌కుమార్



ఆలయం వద్ద స్మిత - రజిత్ రాఘవ్

తిరుమల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ మంత్రి డీఎల్ రవీంద్ర, యువ హీరోలు రోషన్ కనకాల, సుహాస్, రజిత్ రాఘవ్, నటుడు వైవా హర్ష, గాయని స్మితా ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా కన్నడ హీరో శివ రాజ్‌కుమార్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

వేంకటేశ్వర స్తోత్ర ఆడియో ఆవిష్కరణ



తిరుమల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్తోత్ర ఆడియో ఆల్బమ్‌ను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు శనివారం సాయంత్రం తిరుమలలో ఆవిష్కరించారు. బాలగాయని నియార నాగ సుంకరినేని ఈ పాటను ఆలపించగా, నిటార నాగ సుంకరినేని వాద్య సహకారం అందించింది. ఈఆల్బమ్‌కు డాక్టర్ స్వరూప సంగీత సమర్పకులుగా వ్యవహరించారు. ఈసందర్భంగా శ్రావ్యమైన సంగీతంతో పాటను మధురంగా గానం చేశారని చిన్నారులను ఛైర్మన్ అభినందించారు. మరిన్ని పాటలతో తన గానామృతాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో బొల్లినేని రవీంద్రనాథ్, గాయని తల్లిదండ్రులు నిష్మా సుంకరినేని, డాక్టర్ నిఖిల్ సుంకరినేని పాల్గొన్నారు.

మంగళం-2 సచివాలయానికి ట్రాక్టర్ వితరణ



నూతన ట్రాక్టర్‌ను అందుకుంటున్న సెక్రటరి

తిరుపతి అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంగళం-2 గ్రామ సచివాలయానికి శనివారం రూ.6.19లక్షలు విలువచేసే ట్రాక్టర్‌ను వితరణ చేశారు. టాఫే కంపెనీ ప్రతినిధులు ట్రాక్టర్‌ను సచివాలయం సెక్రటరి లావణ్యకు అప్పగించి తాళాలు, దస్త్రాలను అందజేశారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రారంభించారు. దీనిని చెత్త, వ్యర్థాలను తరలించేందుకు, నీటిట్యాంక్ రవాణాకు వినియోగించనున్నారు. బిల్‌కలెక్టర్ సుబ్రహ్మణ్యం, స్థానిక టీడీపీ నాయకులు సురేష్‌నాయుడు, మహేశ్వరి, సురేష్, గోపి, చలపతి, నగేష్ పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగులకు అనువైన ఇళ్ల స్థలాలను కేటాయించాలి

తిరుపతి(వైద్యం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యోగులకు అనువైన ఇళ్ల స్థలాలను కేటాయించే వరకు శాంతియుతంగా పోరాటం సాగించి, సాధించి తీరుతామని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. టీటీడీ ఉద్యోగులకు అలిపిరి జూపార్కు మార్గంలో ఖాళీగా ఉన్న స్థలంలో ఒక్కో ఉద్యోగికి 5 సెంట్ల ఇంటి స్థలం కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం టీటీడీ ఉద్యోగులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో టీటీడీ ఉద్యోగులకు పుత్తూరుకు సమీపంలోని అడవుల్లో ఇళ్ల స్థలాలు కేటాయించడం విడ్డూరమైతే ఆ స్థలాలకు ఒక్కో ఉద్యోగినుంచి రూ.3.20 లక్షలు కట్టించుకోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం, టీటీడీ పాలక మండలి సభ్యులు టీటీడీ ఉద్యోగులను దృష్టిలో పెట్టుకొని జూపార్కు రోడ్డులోనే ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆయన టీటీడీకి లేఖ సమర్పించారు. టీటీడీ ఉద్యోగులకు కరపత్రాలు, టీటీడీ ధార్మిక సంస్థల ముందు గోడ పత్రికలు అంటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపీగౌడ్, శోభ, తేజోవతి, రవి, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ శ్రీహరే అంతరాత్మ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విజయశంకరస్వామి

తిరుపతి(లీలామహల్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాక అన్నమాచార్యులు సమానత్వాన్ని చాటిచెప్పే తత్వాలు, బోధనలే అందరికీ శ్రీహరే అంతరాత్మ పుస్తకమని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో అందరికీ శ్రీహరే అంతరాత్మ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన గీతా జయంతిని పురస్కరించుకుని బీటీఆర్‌కాలనీలోని అన్నమయ్య కళాక్షేత్రం నుంచి పునరంకిత ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ యాత్ర అన్నమయ్య కళాక్షేత్రం నుంచి టీటీడీ పరిపాలనా భవనం వరకు వేలాదిమంది కళాకారులతో కలిసి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో లక్ష్మన్న, రజని, మహేష్, సంక్రాంతి వెంకటయ్య, దేవానంద తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సాంకేతికతతో అనుసంధానించాలి

జాతీయ సదస్సులో వక్తల ఆకాంక్ష



సావనీర్ ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలోని గ్రంథాలయాలు అన్నింటినీ టెక్నాలజీతో అనుసంధానించాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఎస్వీయూ సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. టెక్నాలజీ, ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఫర్ అకడమిక్ అండ్ పబ్లిక్ లైబ్రరీ ఎంపవర్మెంట్ అంశంపై సెనేట్ హాల్లో ప్రారంభ సభ నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ అప్పారావు మాట్లాడుతూ.. దేశంలోని అన్ని గ్రంథాలయాలను టెక్నాలజీతో అనుసంధానించడంతో ప్రజలకు విజ్ఞానాన్ని చేరువ చేయవచ్చని తెలిపారు. యూనివర్సిటీలో సెంట్రల్ లైబ్రరీని నిర్వహించడం, అభివృద్ధి చేయడంలో డైరెక్టర్ సురేంద్రబాబు కృషి అభినందనీయమన్నారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ.. లైబ్రరీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ద్రవిడ వర్సిటీ వీసీ దొరస్వామి మాట్లాడుతూ.. లైబ్రరీలపై పరిశోధనలు సాగాలన్నారు. డీఆర్‌డీఓ డాక్యుమెంటేషన్ హెడ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి, భద్రత కోసం గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, ఇందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర కీలకమన్నారు. ఇండియన్ స్టాటిస్టికల్ సెంటర్ మాజీ డైరెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ.. టెక్నాలజీపై యునెస్కో కూడా ఎక్కువ దృష్టి పెట్టిందన్నారు. ఎస్వీయూ సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్ సురేంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. లైబ్రరీ నిర్వహణ, పాలన, అభివృద్ధి వంటి అంశాల్లో మారుతున్న పరిణామాలను ఈ తరం విద్యార్థులు, పరిశోధకులు అవగాహన చేసుకోవాలని కోరారు. తద్వారా బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో మార్పు చేర్పులు చేపట్టడానికి అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఫ్లిబ్ నెట్ డైరెక్టర్ దేవికా మదల్లి, దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 300 మంది ప్రతినిధులు, విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఒక మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం స్థానిక కోలా వీధిలో చోటు చేసుకుంది. వెస్ట్ ఏఎస్ఐ సురేష్‌బాబు తెలిపిన వివరాలు ఇలా... స్థానిక కోలా వీధిలో కాపురమున్న శశిధర్‌కు గత 15 సంవత్సరాల క్రితం సుభాషిణి(46)తో వివాహమైంది. తిరుపతి అమరరాజా ఫ్యాక్టరీలో పని చేస్తూ ఇటీవల పదవీ విరమణ పొందాడు. వీరి కుమార్తె ఉన్నత చదువుల రీత్యా విదేశాల్లో ఉంటోంది. ఇటీవల సుభాషిణి గుండె జబ్బుకు గురైంది. ఆపరేషన్ కూడా చేశారు. భర్త శశిధర్ కూడా కొంత కాలంగా గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. ఇవన్నీ జీర్ణించుకోలేక శనివారం భర్త శశిధర్ స్నానానికి వెళ్లిన సమయంలో ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని సుభాషిణి ఆత్మహత్య చేసుకుంది. బయటకు వచ్చిన భర్త ఆమె మృతి చెంది ఉండడాన్ని చూసి జీర్ణించుకోలేక ఆయన సైతం సొమ్మసిల్లి పడిపోయాడు. అనంతరం చికిత్స నిమిత్తం రుయాకు తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. మృతురాలి తమ్ముడు కమతం కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఇంటిలో ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సుభాషిణి



విరులు విరిసె.. తనువు మురిసె!

వైభవంగా పద్మావతిదేవికి పుష్పార్చన



తిరుచానూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవేరి పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవ శోభ వెల్లివిరిసింది. అమ్మవారికి శనివారం పుష్పయాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఉత్సవమూర్తిని శ్రీకృష్ణ ముఖమండపంలో కొలువుదీర్చారు. కుంభ మండల ఆరాధన, అగ్ని ప్రతిష్ఠ యాగశాలలో హోమం నిర్వహించారు. అనంతరం నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయంలో ప్రాయశ్చిత హోమం, శాంతి హోమం, పూర్ణాహుతి జరిగింది. సాయంత్రం ఐదు గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని శ్రీకృష్ణముఖ మండపంలో బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి 14రకాల పుష్పాలు, పత్రాలతో పుష్పయాగం నయనానందకరంగా నిర్వహించారు.





ఎకరాకు రూ.2లక్షల ఆదాయం

విత్తనాలు నాటిన తర్వాత 30 రోజులకు వంగనారు సిద్ధమవుతుంది. దీనిని పొలంలో నాటుకోవాలి. 50 రోజులకు దిగుబడి మొదలవుతుంది. ఎకరాకు 70 నుంచి 80 వేలు ఖర్చవుతుంది. ఆరు నుంచి ఎనిమిది నెలల దాకా కాపు ఉంటుంది. మార్కెట్‌లో రేటు బావుంటే ఎకరాకు రెండు లక్షల దాకా ఆదాయం వస్తుంది.

తింటే.. తాళ్వాయిపాడు వంకాయ తినాలి



కథనం పెళ్లకూరు,ఆంధ్రజ్యోతి

'వంకాయ వంటి కూరయు.. పంకజముఖి సీతవంటి భామామణియున్..' అని ఒక పద్యం ప్రచారంలో ఉంది. కూరగాయలన్నింటిలో వంకాయకున్న ప్రత్యేకత అది. 'వంకాయతో వెయ్యిరకాలు' అని కూడా అంటారు. అంటే.. వెయ్యి రకాల వంటలు చేయదగిన కూరగాయ- వంకాయ అని. కాస్త అతిశయోక్తి ఉంటే ఉండవచ్చునుగానీ తెలుగునేల మీద వంకాయకు ఉన్న ప్రాధాన్యం అటువంటిది. పొడుగూ, పొట్టి, తెల్ల, పచ్చ.. అంటూ వంకాయల్లో ఎన్నిరకాలున్నా.. చారలున్న తాళ్వాయిపాడు వంకాయ రుచికి ఏదీ దీటు రాదు. ఎలా వండినా కమ్మగా కరిగిపోయే ఈ వంకాయలకు అందుకే అంత డిమాండ్ ఉంది. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలో శ్రీకాళహస్తి- నాయుడుపేట జాతీయరహదారి మీద ఉండే ఊరే తాళ్వాయిపాడు.

● దేశవిదేశాల్లో డిమాండ్ ● వందల ఎకరాల్లో సాగు



ముదురాకుపచ్చ చారలున్న లేతపచ్చ వంకాయలకు ప్రసిద్ధి తాళ్వాయిపాడు. ఈ గ్రామంలో వంద ఎకరాల్లో వంకాయ సాగు ఉండేది. జాతీయ రహదారి విస్తరణ, కొత్తగా వెలిసిన పరిశ్రమలకు భూములు పోవడం, ఉన్న భూములకు రియల్ ఎస్టేట్ విలువ పెరిగి బంగారంగా మారిపోవడంతో వంగసాగు 40 ఎకరాలకు తగ్గిపోయింది. ఊళ్లో సాగు తగ్గినా తాళ్వాయిపాడు వంకాయ సాగు అనేక సమీప గ్రామాలకు విస్తరించింది. తాళ్వాయిపాడులోని నర్సరీ నుంచి నారు తీసుకువెళ్లి వంగసాగు చేస్తున్నారు. చావలి, చెంబడిపాలెం, పెన్నేపల్లి, కానూరు, రోసనూరు, శిరసనంబేడు, నందిమాల, కానూరుబంగారం పేట, మోదుగులపాళెం, కప్పగుంట కండ్రిగ, చెన్నప్ప నాయుడుపేట, సూళ్లూరుపేట సమీపంలోని మన్నారుపోలూరు, ఆబాక, అగ్రహారం, గూడూరు సమీపంలోని ఇందూరు చెంబడిపాళెం, వెందోడుల్లో దాదాపు 500 ఎకరాల్లో తాళ్వాయిపాడు వంకాయ సాగు చేస్తున్నారు. ఈ విత్తనాలు మార్కెట్‌లో లభించవు. రైతులే తమ పంటనుంచి సేకరించి నారుపోసుకుంటారు. ఈ వంగకున్న డిమాండ్‌ను గ్రహించిన తాళ్వాయిపాడు రైతు కట్టా బాల సుబ్రహ్మణ్యం నర్సరీలో పెద్ద ఎత్తున వంగ నారు పెంచి అమ్ముతున్నారు. బెంగళూరు, హోసూరు ప్రాంత రైతులు కూడా ఇక్కడి నుంచి వంగ నారు తీసుకువెళ్తున్నారు.



నేదురుమల్లికి ప్రియమైన వంకాయ

ఉమ్మడి ఏపీ ఒకనాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి తరచూ తాళ్వాయిపాడు నుంచి హైదరాబాదుకు వంకాయలను తెప్పించుకునేవారు. ఢిల్లీ నుంచి వచ్చే నాయకులకు వీటితో వంటకాలు చేయించే పెట్టేవారు. ఆయన ఇచ్చే విందుల్లో తాళ్వాయిపాడు వంకాయలతో చేసిన కూరలను అతిథులు ఇష్టంగా తినేవారని చెబుతారు. ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్న కాలంలో తాళ్వాయిపాడు నుంచి వంగనారు విమానంలో తెప్పించుకుని తన పెరటిలో వేయడంతో పాటూ, ఢిల్లీలోని కొందరు నాయకులకూ ఇచ్చారు. తాళ్వాయిపాడు వంకాయ రుచి ఎరిగిన ఈప్రాంతవాసులు తమ స్నేహితులకు తరచూ ఈ వంకాయలను పంపుతుంటారంటే అతిశయోక్తి కాదు.

స్వర్ణముఖి నీటి మహిమ

స్వాతంత్ర్యానికి పూర్వం నుంచీ తాళ్వాయిపాడులో వంగసాగు జరుగుతున్నట్టు చెబుతున్నారు. తాళ్వాయిపాడు వంకాయకు ఇంత కమ్మటి రుచికి కారణం స్వర్ణముఖి నదీతీరపు నేలలో పెరగడమేనని ఇక్కడి రైతులు చెబుతారు. ఇదే వంకాయ ఇతర ప్రాంతాల్లో పండినా, వాటికీ, ఈ ఊరిలో పండిన వంకాయకూ రుచిలో తేడా ఉంటుందంటారు. అందుకే ఢిల్లీ, బెంగళూరు, చెన్నైలకు తాళ్వాయిపాడు వంకాయలు పంపుతుంటారు. ప్రముఖులు తమ బంధు మిత్రులకు కానుకగా తాళ్వాయిపాడు వంకాయలు పంపుతుండడాన్ని బట్టి దీని ప్రత్యేకను గ్రహించవచ్చు. బెంగళూరు, చెన్నై, తిరుపతి, నెల్లూరు బస్సుల్లో తాళ్వాయిపాడు వంకాయలు పంపేవారు. బస్తాలపై టీవీఎస్(తాళ్వాయిపాడు వంకాయల సర్వీస్) అని రాసేవారు. రవాణాలో సిబ్బంది, కూలీలు ఈ అక్షరాలున్న మూటలను ఎలా అంటే అలా పడేసేవారు కాదు.



వంగకు డిమాండ్ ఎక్కువ

నాకున్న ఒకటిన్నర ఎకరా నేలలో 50 సెంట్లు వంగ సాగు చేస్తున్నా. మిగిలిన నేలలో ఆకు కూరలు, చిక్కుడు, బెండ వేశాను. అయితే వంగకున్న డిమాండ్ ఎప్పుడూ మిగిలిన వాటికి ఉండదు.

- మనుబోలు కార్తిక్, తాళ్వాయిపాడు.

సేంద్రియమే ఎక్కువ

రెండు ఎకరాల విస్తీర్ణంలో వంగనారు పెంచుతాను. మంచి డిమాండ్ ఉంది. నారుకీ, సాగుకీ కూడా 80శాతం సేంద్రియ పద్ధతినే అనుసరిస్తాం. వేప కషాయం, పేడ ఎరువులనే నేలలో కలియదున్ని నారు నాటుకుంటాం. ఈ పద్ధతి వల్ల చీడపీడలు తక్కువగానే ఆశిస్తాయి. అప్పటికీ పురుగు ఆశిస్తే ఇక తప్పనిసరి పరిస్థితుల్లో రసాయన మందులు పిచికారీ చేస్తుంటాం.

-కట్టా బాలసుబ్రహ్మణ్యం, నర్సరీ యజమాని, తాళ్వాయిపాడు.



మా కుటుంబానికి ఆసరా

ఎన్నో ఏళ్లుగా మేం వంగ సాగు చేస్తున్నాం. లాభదాయకమైన పంట ఇది. ఉద్యానశాఖ అధికారుల సూచనలు కూడా తీసుకుంటూ ఉంటాం. కోతలు మొదలయ్యాక రోజు మార్చి రోజు మార్కెట్‌కి కాయలు పంపుతాం. మా కుటుంబానికి పెద్ద ఆసరా వంగసాగు.

- హరిప్రియ, వంగరైతు



ఈ నంబర్ల నుంచి ఫోన్లు వస్తే లిఫ్ట్ చేయొద్దు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు, ఇంటర్నేషనల్ కాల్స్ వస్తే వెంటనే లిఫ్ట్ చేయకూడదని జిల్లా సైబర్ క్రైం పోలీసులు హెచ్చరించారు. ఏమరపాటుగా ఉంటే బ్యాంకు అకౌంట్లలో ఉండే డబ్బు కాజేస్తారని చెబుతున్నారు. తరచూ ప్లస్ 381 (సెర్బియా), ప్లస్ 255(టాంజానియా), ప్లస్ 563(లోవా) ప్లస్ 375(బెలారస్) వంటి కోడ్ నెంబర్లతో ఫోన్ రింగ్ అవుతుందని, వీటితో పాటు 94777455913, ప్లస్ 255901130460, ప్లస్ 56322553736, ప్లస్ 37052529259 తదితర నెంబర్ల నుంచి ఫోన్లు వస్తే లిఫ్ట్ చేయవద్దని సూచించారు. లిఫ్ట్ చేస్తే కేవలం మూడు సెకన్లలో ఫోన్‌లోని విలువైన సమాచారాన్ని కాజేసే అవకాశముందని వివరించారు. కాగా, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి, హ్యాష్ 90 లేకుంటే హ్యాష్ 09 నెంబర్లను ప్రెస్ చేయాలని కోరుతున్నారని, దాన్ని అంగీకరించవద్దని సూచించారు. పొరబాటున ఈ కోడ్‌లు ఎంటర్ చేస్తే యూజర్ సిమ్ కార్డు యాక్సెస్ కేటుగాళ్ల చేతికి వెళ్లే అవకాశముందని సైబర్ క్రైం సీఐ వినోద్ తెలిపారు.

సైబర్ వలలో ఆర్టీసీ ఉద్యోగి

● రూ.1.18 లక్షలు పోగొట్టుకున్న వైనం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని ఆర్టీసీ ఉద్యోగి సైబర్ వలకు చిక్కాడు. వారి మాటలకు మోసపోయి తనతో పాటు కుమార్తె అకౌంటులోని రూ.1.18లక్షలు పోగొట్టుకున్నాడు. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం ధనలక్ష్మీనగర్‌కు చెందిన సురేంద్రనాథరెడ్డి తిరుపతి ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్నాడు. గతనెల 26వ తేదీన టీవీ డిష్ యాక్టివేషన్ చేయడానికి ప్రయత్నించాడు. ఆన్‌లైన్ ద్వారా కస్టమర్ కేర్ నంబరుకు ఫోన్ చేశాడు. ఆ సమయంలో సైబర్ క్రైం మోసగాళ్లు వాట్సాప్ ద్వారా రస్ట్ డస్క్ రిమోట్ యాక్సెస్ యాప్‌ను ఫోన్ ద్వారా డౌన్‌లోడ్ చేయించారు. దీంతో సురేంద్రనాథరెడ్డి మొబైల్ ఫోన్ నంబరును మెల్లగా యాక్సస్‌లోకి తీసుకున్నారు. అకౌంట్‌లో బ్యాలెన్సు చెక్ చేయమని చెప్పారు. బ్యాలెన్సు చూడగా కుమార్తె అకౌంటులో ఉన్న రూ.28,001లు, సురేంద్రనాథరెడ్డి అకౌంటులో ఉన్న రూ.90,300 మొత్తం రూ.1.18లక్షలు మాయమైపోయాయి. దీనిపై శనివారం తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించింది. రూ.2.97కోట్లు ఆదాయం లభించినట్టు శనివారం ఉదయం ప్రకటించింది.శుక్రవారం 75,782 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా,26,057మంది తలనీలాలు సమర్పించారు.

ఫిబ్రవరిలో 'ఉప్పు కప్పురంబు' విడుదల

● హీరో సుహాస్



తిరుమల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కీర్తి సురేష్‌తో 'ఉప్పు కప్పురంబు' అనే చిత్రం షూటింగ్ జరుగుతోందని, ఫిబ్రవరిలో ఈ చిత్రం విడుదల కానుందని హీరో సుహాస్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం దర్శించుకున్న సుహాస్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తన 'కలర్ ఫొటో' చిత్ర దర్శకుడు సందీప్ వివాహం కోసం తిరుమలకు వచ్చి స్వామి ఆశీస్సులు పొందినట్టు తెలిపారు. చాలా రోజుల తర్వాత మంచి దర్శనం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. కాగా, ఆలయం ముందు సుహాస్‌ను చూసేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు. ఆయనతో కలిసి సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

అడవి జంతువుల కోసం విద్యుత్ తీగలు

మూడు గేదెలు, ఒక ఆవు మృతి

పెళ్లకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అడవి జంతువుల కోసం తీసిన విద్యుత్ తీగలు తగిలి మూడు గేదెలు, ఒక ఆవు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు... రోసనూరు రాజుపాలెం అరుందతి కాలనీకి చెందిన రవి తన రెండు గేదెలు, ఒక ఆవును గురువారం ఉదయం మేత కోసం అడవిలోకి తోలుకెళ్లి వదిలాడు. చీకటి పడ్డాక కూడా గేదెలు, ఆవు రాకపోవడంతో మరసటి రోజు వస్తాయని భావించాడు. శుక్రవారం సాయంత్రం పశువులను తోలుకురావడానికి



అడవికి వెళ్లగా ఎక్కడా కనిపించలేదు. గాలించగా సమీపంలోని మామిడి తోటలో మృతి చెంది కనిపించాయి. అక్కడి పరిసరాలను పరిశీలించగా అడవి జంతువుల వేట కోసం తీసిన విద్యుత్ తీగలు కనిపించాయి. పశువులకు విద్యుత్ తీగలు తగిలి కాలిన గాయాలు ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. శనివారం ఉదయం ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మామిడి తోటను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, మామిడి తోట యజమాని చెన్నైలో నివాసం ఉండడంతో స్థానికులు ఎవరో అడవి జంతువుల వేట కోసం విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి ఉంటారని అనుమానిస్తున్నారు.

రెచ్చిపోయిన తాగుబోతులు

● మద్యం మత్తులో ప్రైవేటు ఇంజనీర్‌పై దాడి

● ముక్కంటి ఆలయ ఉద్యోగికి దేహశుద్ధి

శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ ఒప్పంద ఉద్యోగి ఒకరు కొందరు తాగుబోతు మిత్రులతో కలిసి రెచ్చిపోయాడు. అకారణంగా రోడ్డు పక్కన నిలబడి ఉన్న ఓ ప్రైవేటు ఇంజనీర్‌పై దాడి చేశాడు. ఈ ఘటనను చూసిన కొందరు స్థానికులు ఆలయ ఉద్యోగిని చితకబాదారు. శ్రీకాళహస్తికి చెందిన వినోద్ చౌదరి అనే యువకుడు రేణిగుంటలోని ఓ ప్రైవేటు కర్మాగారంలో ఇంజనీర్‌గా పనిచేస్తుంటాడు. శుక్రవారం రాత్రి శ్రీకాళహస్తిలోని శ్రీరామ్‌నగర్‌కాలనీ తిరుపతి ప్రధాన రహదారి పక్కన ఉన్న తన అత్తగారి ఇంటి వద్దకు వెళ్లాడు. అక్కడ నిలుచుని భార్యతో మాట్లాడుతూ ఉన్నాడు. కడప ప్రాంతానికి చెందిన భాస్కర్‌రెడ్డి శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఒప్పందఉద్యోగిగా పనిచేస్తుంటాడు. ప్రస్తుతం ఆయన భక్తకన్నప్ప సదన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి శ్రీకాళహస్తికి చెందిన ముగ్గురితో పాటు ఊరందూరు గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి పూటుగా మద్యం సేవించాడు. ఈ నలుగురు శ్రీరామ్‌నగర్ కాలనీ వద్ద వెళుతూ వినోద్ ఉన్న నిలబడి ఉన్న చోట ఆగారు. తమను చూసి ఏదో మాట్లాడుకుని నవ్వుతున్నారని దంపతులపైకి దురుసుగా దూసుకెళ్లారు. తాము కుటుంబ విషయాలు మాట్లాడుకుంటున్నామని వారిస్తున్నప్పటికీ భాస్కర్‌రెడ్డి చెప్పును చేతిలోకి తీసుకుని వీరంగం చేశాడు. అతనితోపాటు ఉన్న మరో ఇద్దరితో కలిసి దాడికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న అత్త, భార్య తాగుబోతులను అడ్డుకున్నా వారు బూతులతో మరింత దాడికి పాల్పడ్డారు. భాస్కర్‌రెడ్డితో పాటు ఉన్న పళని అనే యువకుడు తాను పోలీసు అధికారులకు ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తుంటానని బెదిరింపులకు దిగాడు. కొందరు స్థానికులు గొడవను కట్టడిచేసేందుకు చొరవ తీసుకుని ఆలయ ఉద్యోగి అయిన భాస్కర్‌రెడ్డిని అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఆయన మాట వినకపోవడంతో చితకబాదారు. వినోద్ ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి వెంటనే భాస్కర్‌రెడ్డిని అతడి స్నేహితులను స్టేషన్‌కు పిలిపించి మందలించారు. మరోసారి ఇలా జరిగితే రౌడీషీట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్ని మాపక సిబ్బంది



తిరుమలలో కారు దగ్ధం

● ప్రయాణికులు సురక్షితం

తిరుమల, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం రాత్రి ఓ కారు దగ్ధమైంది. కారులో ప్రయాణించిన భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. బెంగళూరు వైట్‌ఫీల్డ్‌కు చెందిన భరత్ నలుగురు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం తన కారులో శనివారం రాత్రి తిరుమలకు చేరుకున్నాడు. గది ఎలా పొందాలనే సమాచారం తెలుసుకునేందుకు బాలాజీ ఆర్టీసీ బస్టాండ్ వద్ద కారును ఆపారు. ఈ క్రమంలోనే కారు ఇంజిన్ నుంచి పొగలు రావడాన్ని గుర్తించిన భరత్ కుటుంబ సభ్యులను, లగేజీని కారు నుంచి దింపేశాడు. ఏమైందో గుర్తించేలోపే కారు నుంచి నెమ్మదిగా మంటలు రావడం మొదలైంది. సమీపంలోని భద్రతా సిబ్బంది ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. ఈలోగా కారు నుంచి భారీగా మంటలు ఎగసిపడ్డాయి. అదే సమయంలో అక్కడున్న భక్తులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. ఘటనా ప్రాంతానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● విభిన్న ప్రతిభావంతులకు డీఆర్వో నరసింహులు పిలుపు

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు వెళ్లాలని డీఆర్వో నరసింహులు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ఇతరుల మీద ఆధారపడకుండా స్వయం కృషితో జీవించాలనే ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. జిల్లా యంత్రాంగం తరపున విభిన్న ప్రతిభావంతులకు అన్ని సదుపాయాలను అందిస్తున్నట్లు చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల జీవన ప్రమాణాలను మెరుగు పరచడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్ నాయకులు మాధవ, మురళి, సుబ్రహ్మణ్యం, రెడ్డెప్ప, విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యంరెడ్డి, పద్మజ, విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

షార్‌లో 5కే రన్

సూళ్లూరుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో శనివారం ఇంటిగ్రిటీ 5కే రన్ నిర్వహించారు. దేశ శ్రేయస్సు, సంస్కృతి, సమగ్రత అనే నినాదంతో నిర్వహించిన 5కే రన్‌ను షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ప్రారంభించారు. షార్‌లోని మిషన్ కంట్రోల్ సెంటర్ వద్దనున్న సతీష్ ధావన్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన 5కే రన్ అంతరిక్ష కేంద్రీయ పాఠశాల వరకు సాగింది. 5కే రన్‌లో షార్ ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విజేతలకు అంతరిక్ష కేంద్రీయ పాఠశాల మైదానంలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో షార్ కంట్రోల్ శ్రీనివాసులురెడ్డి, గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ, శంకరన్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీసిటీలో ఈప్యాక్ పరిశ్రమ విస్తరణకు భూమిపూజ



వరదయ్యపాళెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ఈప్యాక్ డ్యూరబుల్ లిమిటెడ్ పరిశ్రమ, తమ అధునాతన ఉత్పత్తి కేంద్రానికి శనివారం భూమిపూజ చేపట్టింది. పరిశ్రమ ఎండీ, సీఈవో అజయ్ సింఘానియా మాట్లాడుతూ ఈప్యాక్ ప్రయాణంలో ఇదో మైలురాయి అన్నారు. మేక్ ఇన్ ఇండియా చొరవకు అనుగుణంగా దేశీయ తయారీని ప్రోత్సహించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీకి ఇది మరో ముందడుగు అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎల్‌బి బోత్రా, హైసెన్స్ ఇండియా సీఈవో పంకజ్ రాణా, ఎండీ స్టీవెన్ లీ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పంచాయతీల అభివృద్ధి

- సర్పంచులతో ఎమ్మెల్యే నాని

తిరుపతిరూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలానికి చెందిన పలువురు సర్పంచ్‌లు శనివారం ఉదయం ఎమ్మెల్యే పులివర్తి నానీని ఇంటివద్ద కలిశారు. పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో ఎమ్మెల్యేని సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. పార్టీలకు అతీతంగా పంచాయతీలను అభివృద్ధి చేసుకుందామని, ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. లింగేశ్వరనగర్, సాయినగర్, కేసీపేట, అవిలాల, బ్రాహ్మణపట్టు, పద్మావతిపురం సర్పంచ్‌లు, టీడీపీ రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి, కూటమి పార్టీ నేతలు గణపతినాయుడు, సునీల్‌చౌదరి, అమిలినేని మధు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నానీతో సర్పంచ్‌లు

గంటల్లోనే చెవిరెడ్డితో భేటీ

శనివారం ఉదయం ఎమ్మెల్యే నానీని కలిసిన సర్పంచ్‌లు మధ్యాహ్నం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో భేటీ అయ్యారు. పంచాయతీల్లో నిధులున్నా , రూ.50వేలకన్నా ఎక్కువ అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే లేదా ఎంపీడీవో అనుమతి తీసుకునేలా ఆదేశించడంతో పల్లెల్లో పనులు పూర్తిచేయలేకపోతున్నామని,కార్యదర్శులు కూడా తమకు సహకరించడంలేదని చెప్పుకొచ్చారు.అభివృద్ధి పనులకు సహకరించని అధికారులను ప్రజలముందు దోషులుగా నిలబెడదామని చెవిరెడ్డి వారితో చెప్పారు.ఉదయం ఎమ్మెల్యేని కలసి సన్మానించిన సర్పంచులు గంటల వ్యవధిలోనే మాజీ ఎమ్మెల్యే ఇంటికి వచ్చి విమర్శలు చేయడం వెనుక ఆంతర్యమేమిటన్న చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తోంది.

పుత్తూరు వార్తలు

ముగ్గురు సర్వేయర్ల నియామకం

పుత్తూరు, డిశంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండవ రోజు రెవిన్యూ సదస్సులు శిరుగురాజుపాళెం, కళింకుప్పం గ్రామాలలో జరిగాయి. శిరుగురాజుపాళెం గ్రామంలో సర్వే మీద అనేక ఫిర్యాదులు రావడంతో వెంటనే తహసీల్దారు వెంకటేశ్వర్లు స్పందించి ముగ్గురు సర్వేయర్లను ప్రత్యేకంగా నియమించారు. వీరు సోమవారం నుంచి పని ప్రారంభించి గ్రామం పూర్తిగా సర్వేచేస్తారని తెలిపారు. వేణుగోపాలపురం గ్రామ కంఠాన్ని కొందరు రైతులు సాగు చేసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. అలాగే డీకేటీ భూమిలో అక్రమంగా ప్రవేశించారని మరో ఫిర్యాదు అందింది. ఈ రెండు గ్రామాలలో జరిగిన సదస్సులకు 39 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమాలలో ఆర్ఐ తిరుమలసాయి, సర్పంచ్‌లు మురళి, వెంకటేశ్ యాదవ్, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి పాల్గొన్నారు.

దళిత ప్రొఫెసర్‌పై దాడి అమానుషం



రౌండ్ టేబుల్ సమావేశం

పుత్తూరు, డిశంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్వి యూనివర్సిటీలో పనిచేసే దళిత ప్రొఫెసర్ చంగయ్య మీద దాడిని స్థానిక అంబేద్కర్ ట్రస్ట్ భవన్‌లో శనివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు ఖండించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ భవన్ కార్యదర్శి అపరంజి మాట్లాడుతూ తప్పుచేసినప్పుడు పై అధికారులకు ఫిర్యాదు చేయకుండా దాడికి పాల్పడడం అమానుషమని అన్నారు. మతసామరస్యం కలిగిన తిరుపతి క్షేత్రంలో ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు రమేష్, నాగూర్, ప్రసాదరావు, రామచంద్రయ్య పాల్గొన్నారు.

శిక్షణలో నైపుణ్యాలు పెంచుకోవాలి



శిక్షణ ను పరిశీలిస్తున్న డీవైఈవో

వడమాల పేట, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): శిక్షణా తరగతుల్లో విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలని డీవైఈవో విశ్వనాథనాయక్ చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ కోర్సులో అకౌంట్, టాక్సేషన్ విద్యార్థులు పొందుతున్న శిక్షణను శనివారం పరిశీలించారు. స్థానిక గ్రామీణ బ్యాంక్‌లో అకౌంటింగ్ విభాగంలో విధివిధానాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని చెప్పారు. ఉద్యోగాన్వేషణలో ఇలాంటి సామర్థ్యాలను పరిగణనలోనికి తీసుకొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ప్రకాష్, శ్రీనివాసులు, కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

వడమాలపేట, డిసెంబర్ 7(ఆంధ్రజ్యోతి): రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులునాయుడు కోరారు. శనివారం ఏఎం పురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ జరీనా మాట్లాడుతూ వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు.

వైభవంగా ఊంజల్ సేవ



నారాయణవనం, డిసెంబర్ 7(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకన్న ఊంజల్ సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు జరిపించారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బట్టాచార ఊంజల్ సేవ జరిపించారు. ఆలయాధికారులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు టౌన్, డిసెంబర్ 7(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు మధ్యవర్తిత్వంపై అవగాహన కలిగి ఉండాలి అని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర తెలిపారు. శనివారం పుత్తూరు న్యాయవాదుల సంఘం భవనంలో మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఈ నెల 14వ తేది జరగబోవు జాతీయ లోక్ అదాలత్ జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ, నగరి జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన బోధన చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంజి మాధవయ్య

పుత్తూరు టౌన్, డిసెంబర్ 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉపాధ్యాయులకు నైతిక విలువలతో కూడిన బోధన చేయాలని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య తెలిపారు. శనివారం పరమేశ్వరమంగళం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పేటీఎంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలకు వచ్చే రోడ్డును సీసీ రోడ్డుగా మార్చాలని హెచ్‌ఎం చంద్రశేఖర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు జయశేఖర్, నగేష్, సుధాకర్ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోర్టు భవన మరమ్మతులు నాణ్యతతో చేపట్టాలి



గౌరవ వందనం స్వీకరిస్తున్న జడ్జి భీమారావు

పుత్తూరు టౌన్, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): కోర్టు భవనం మరమ్మతు పనులు నాణ్యతతో చేయాలని జిల్లా జడ్జి భీమారావు, ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. పుత్తూరు కోర్టు భవనం మరమ్మతు పనులను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం కోర్టులో రికార్డులను పరిశీలించారు. అంతకుముందు ఆయన గౌరవ వందనం స్వీకరించారు. ఆయనతో పాటు సీనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ, న్యాయవాదులు పురుషోత్తం, రాజారెడ్డి ఉన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

సూళ్లూరుపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను సదరన్ రైల్వే డీఆర్‌ఎం విశ్వనాథ్ ఏర్యా శనివారం పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం కచ్చేరవీధిలో రైల్వేగేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం డీఈఎన్ రామ ప్రసాద్, సిగ్నల్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.



అండర్ బ్రిడ్జి ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌ఎం, రైల్వే అధికారులు

విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దడం

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమష్టి బాధ్యత

వాకాడు, చిట్టమూరు, డిసెంబర్ 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమష్టి బాధ్యత అని సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన అన్నారు. వాకాడు మండలంలోని ఎస్‌ఏఎల్‌సీ ఈఎఫ్ పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు తొలి గురువు తల్లిదండ్రులే అన్నారు. విద్యార్థులను ప్రతిరోజు బడికివెళ్లేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. విద్యార్థుల నడవడికలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు, పురుషులకు తాడులాగే పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● చిట్టమూరు జీఎం నాయుడు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి సబ్ కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బంగారు భవిష్యత్తు నిర్మించుకోవాలని సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడుతో కలిసి విద్యార్థులు



వాకాడులో ఎస్ఏఎల్‌సీ ఈఎఫ్ ఉన్నత పాఠశాల సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా

సాంస్కృతిక ప్రదర్శలు ఇచ్చారు. తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుడు దారా వాసుకి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో క్రిష్ణయ్య, హెచ్‌ఎంలు భూపయ్య, మీనాకుమారి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నారాయణ, భషీర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.22 కోట్లతో వసతి గృహాల అభివృద్ధి: విజయశ్రీ



బాలుర గురుకులంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

నాయుడుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో రూ.1.22 కోట్లతో వసతిగృహాలను అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. నాయుడుపేటలోని బాలికల, బాలుర, గురుకుల పాఠశాల, కళాశాలల్లో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో వసతిగృహాల్లో సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లగా వారు వెంటనే స్పందించి రూ.1.22 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల విద్యాభ్యాసం, పాఠశాలల్లో, వసతి గృహాల్లో వసతులు, భోజన సదుపాయాల గురించి తల్లిదండ్రులకు తెలుస్తాయన్నారు. వారి భాగస్వామ్యం వల్ల పాఠశాలలను మరింత అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శాంతి, ప్రిన్సిపాల్లు దాదాపీర్, రూత్ రమోలా, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పార్థసారధి, నానాబాల సుబ్బారావు, కుబేరు మణి, వెంకటయ్య, సంచి కృష్ణయ్య, సిద్దయ్య నాయుడు, ధనంజయ, శేఖర్ పాల్గొన్నారు.

పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి

దొరవారిసత్రం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టాలని సూళ్లూరుపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి అనిల్‌కుమార్ కోరారు. శనివారం మావిళ్ళపాడు మోడల్ స్కూల్‌లో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు మంచి విద్యాబుద్ధులు నేర్పుతారని, అయితే పిల్లలు వారు చేసే స్నేహం, ఉండే వాతావరణం వల్ల వారి నడవడికలో మార్పు వస్తుందన్నారు. ఆ మార్పును తల్లిదండ్రులు గుర్తించి పిల్లలను సక్రమైన మార్గంలో నడిపించాలని సూచించారు. టెక్నాలజీ వినియోగం అధికమైన నేపథ్యంలో సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా స్నేహాల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే పలు చట్టాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుమలత, ఉపాధ్యాయులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఎస్ అనిల్‌కుమార్

గూడూరులో మల్టీసూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు: పాశిం



సిద్ధార్థ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశిం

గూడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరాలకు దీటుగా గూడూరు పట్టణంలోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సిద్ధార్థ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక నరసింగరావుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన సిద్దార్థ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన ప్రజలు సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవల కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సి ఉండడంతో ఇబ్బందులు పడేవారన్నారు. గూడూరు పట్టణంలో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించి అన్ని రకాల వ్యాధులకు వైద్యసేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన డాక్టర్ తలమంచి వినోద్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే పాశిం అభినందించారు. డాక్టర్ వినోద్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీసుధ ఎంతో అనుభవం కలిగిన వైద్యులని, వీరి ఆధ్వర్యంలో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని గూడూరులో ప్రారంభించడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో తలమంచి సిద్దారెడ్డి, చదలవాడ హరిప్రసాద్, డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలి

గూడూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని, దీనిని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏడవ అదనపు జిల్లా జడ్జీ షమ్మీపర్వీన్ సుల్తానా బేగం అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెక్షన్ 89 సీపీసీ ప్రకారం మధ్యవర్తిత్వం ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు అరవ పార్వతయ్య, కొండలరావు, వెంకటసుబ్బయ్య, సుమన్, వంశీ, వెంకటేశ్వర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానా నాబేగం

విద్యార్థులకు బంగారు భవిష్యత్తు చూపాలి

పుత్తూరు, డిశంబరు 7(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పిల్లలకు బంగారు భవిష్యత్తు చూపాలని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని 80 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో శనివారం పేరెంట్, టీచర్స్ సమావేశాలు జరిగాయి. మండలానికి ప్రత్యేక అధికారిగా వచ్చిన జిల్లా ట్రైబల్ ఆఫీసర్ సూర్యనారాయణ తల్లిదండ్రులను ప్రత్యేకంగా మెయిన్ పాఠశాలలో జరిగే విషయాలను అడిగారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో రాచపాళెం నుంచి వచ్చే మధ్యాహ్నపు భోజనం నాణ్యతగా లేదని, కోడిగుడ్డు సైజు చిన్నగా ఉందని విద్యార్థి తండ్రి అయ్యప్ప ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అన్నం సరిగా ఉడకడం లేదని తల్లి అభిరామి పేర్కొన్నారు. తన బిడ్డకు ఇంటి నుంచే క్యారియర్ పంపుతున్నాని తండ్రి గోవిందస్వామి విచారం వ్యక్తం చేశారు. అనంతరం ప్రత్యేక అధికారి సూర్యనారాయణ మాట్లాడుతూ తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకుని పిల్లల చదువు, ఆరోగ్యం, నడవడికలను గమనించాలని కోరారు. తర్వాత గోపాలకృష్ణాపురంలోని మూడు గురుకుల పాఠశాలల సమావేశాల్లో పాల్గొన్నారు. గేట్‌పుత్తూరులోని ఎస్టీ పాఠశాలలో తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమాలలో ఎంపీడీవో రమేష్, ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో స్పెషల్ ఆఫీసర్ ముఖాముఖి

ఘనంగా తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం

వడమాలపేట, డిసెంబర్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు ఆత్మీయ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల తల్లిదండ్రులకు సందేశాన్నిస్తూ విద్యార్థినులు చేసిన నృత్యం పలువురిని అలరించింది. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ షబ్బీర్, ఉప చైర్మన్ అలేఖ్య ప్రధానోపాధ్యాయులు కరుణానవనీతం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులకు రంగవల్లి, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ రవికుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటరమణ, వేమాపురంలో డ్వామా డీఈ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

నారాయణవనం, డిసెంబర్ 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను సాధించి, ఉన్నత లక్ష్య సాధనకు కృషి చేయాలని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. శనివారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలికలు) నందు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూవిద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని, క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలన్నారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని బాగా చదివి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకుని రావాలని కోరారు. అనంతరం పుత్తూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ప్రభాకర్ రాజు, ఎంఈవో జనార్దన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులలో అభ్యసన స్థాయిని పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుమన్‌కుమార్, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ విజయ్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ మోహన్‌బాబు, వైస్ చైర్మన్ ఆయేషా, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హోలిస్టిక్ కార్డులను చూపుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రోత్సాహంతోనే ఉత్తమపౌరులుగా విద్యార్థులు



సీఎస్‌ఎం పాఠశాలలో విద్యార్థినికి సమగ్ర ప్రగతి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే విద్యార్థులు ఉత్తమపౌరులుగా ఎదుగుతారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక సీఎస్‌ఎం జడ్పీబాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం నూతన శకానికి నాందిపలికారన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం నెలకొల్పి విద్యార్థుల్లో పిల్లల విద్య శ్రద్ధ పెంపొందించే విధంగా కొత్తఒరవడిని ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రమణకుమార్, డిప్యూటీ ఈవో సనత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సీఐ శేఖర్‌బాబు, హెచ్‌ఎం శ్రీనివాసులు, మాధవిలక్ష్మీ, భారతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల మెరుగుకే సమావేశాలు



పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి

చిల్లకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చదువుల్లో విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు దోహదపడుతాయని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థులకు సమగ్ర ప్రగతిపత్రాలు అందజేసి, పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం ముగ్గులు, ఆటల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాటూరు కవిత, దిలీప్‌రెడ్డి, ప్రభాకర్, హెచ్‌ఎం జాన్‌పీటర్, కోదండరామయ్య, ఉపాధ్యాయులు చంద్రయ్య, శంకరయ్య, శ్రీనివాసులు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపట్టాలు మంజూరు చేయించండి



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు శరత్‌బాబు

తడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి అటవీ పోరంబోకు భూమిలో గృహాలు నిర్మించుకొని జీవిస్తున్నామని, ఆ ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని మాంబట్టు గ్రామస్తులు సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయిని వేడుకున్నారు. శనివారం మాంబట్టులో రెవెన్యూ సదస్సు జరిగింది. ఆర్డీవో కిరణ్మయి పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 600 మంది అటవీ పోరంబోకు భూముల్లో ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్నామని, ఆ స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. స్పందించిన ఆర్డీవో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు శరత్‌బాబు, సర్పంచు రమణయ్య, టీడీపీ నాయకులు మురళీరెడ్డి, వేనాటి రాజారెడ్డి, సురేష్‌రెడ్డి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో దోమల మందు పిచికారీ

సూళ్లూరుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీలో దోమల నివారణకు తొలిసారిగా డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలో పలు ప్రాంతాల్లో నీరు నిల్వఉండడంతో దోమలకు ఆవాస కేంద్రాలకు మారాయి. దీని వల్ల విష జ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య నీరు నిల్వవున్న ప్రాంతాల్లో డ్రోన్ సాయంతో రసాయనాలు పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా ప్రారంభించారు. టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, నాయకులు పాముూరు మునస్వామి, నలజాం రాము, పార్థసారధి మీజూరు వెంకటేశ్వర్లురెడ్డి, బీజేపీ నాయకులు తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీపీ తంబిరెడ్డి తనూజా రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి హర్షనీయమన్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తామని ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తులసీజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని 101 పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించారు.

మద్యం స్వాధీనం..ఒకరి అరెస్టు

ఏర్పేడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మోదుగలపాళెం గ్రామానికి చెందిన హరి కొద్దిరోజులుగా మద్యం అక్రమంగా విక్రయిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలో సీఐ జయచంద్ర సిబ్బందితో కలిసి శనివారం నిఘా ఉంచారు. హరి కుమ్మరికండ్రిగ ఎస్టీకాలనీ రోడ్డుపై మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేశారు. పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

మా భూములు మాకే ఇప్పించండి


తహసీల్దారు రాజశేఖర్‌కు వినతులు అందజేస్తున్న జనం

వరదయ్యపాళెం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తమకు భూములు తమకే ఇప్పించాలని బత్తలవల్లం దళితులు తహసీల్దారు రాజశేఖర్‌ను కోరారు. శనివారం మండలంలోని బత్తల్లవల్లం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అందులో దళితులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఓవలచేను గుంట ప్రాంతంలో మేత బీడు భూమి సర్వే నెంబరు 7లో 147 ఎకరాలు, 6, 8, 9లో సుమారు 300 ఎకరాలు భూములను సాగుచేసుకునేవారమని గుర్తుచేశారు. ఆ భూములు సాగుచేసుకు నేందుకు అటవీ అధికారులు అడ్డుపడుతు న్నారని పేర్కొన్నారు. అదే సమయంలో కల్కి ఆలయం వారు తమ పొలాలను అద్దె పేరుతో తీసుకుని వారి ఆధీనంలో ఉంచుకున్నారని వాపోయారు. తమ భూములు తమకే చెందేలా చూడాలని విన్నవించారు.

విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కేవీబీపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పలువురు కోరారు. శనివారం మండలంలోని పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో చెప్పిన విషయాలను తల్లిదండ్రులు పిల్లలను అడిగి తెలుసుకోవాలన్నారు. ఎస్‌ఐ ఓబయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమశిక్షణలో పెంచి సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణంలో నాయకులు, అధికారులు మొక్కలను నాటారు. ● కేజీబీవీ పాఠశాలలో టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజుల నాయుడు గోపీనాథ్‌రెడ్డి, ఎస్‌ఎంసీ కమిటీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సుకన్య, సత్యవేడు టీడీపీ యువత ఉపాధ్యక్షుడు లక్ష్మీపతిరాజు, సర్పంచ్ బాలాజీ, సంధ్య, శివరావు, పాల్గొన్నారు.

సత్యవేడు, నాగలాపురం: సత్యవేడు, నాగలాపురం మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ పండుగ వాతావరణంలో జరిగింది. సమావేశానికి హాజరైన తల్లిదండ్రులకు విద్యార్థులు పుష్ప గుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి పాఠశాలల అభివృద్ధిపై సలహాలు, సూచనలను స్వీకరించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి

సాగు భూములకు హక్కులు కల్పించాలి

రేణిగుంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలిచ్చి హక్కులు కల్పించాలని రైతులు విన్నవించారు. మండలంలోని మామండూరు గ్రామంలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆ మేరకు వినతిపత్రం సమర్పించారు. అలాగే పాఠశాల, శ్మశాన వాటిక సర్వే కోసం గ్రామస్థులు విన్నవించారు. తర్వాత ఎర్రగుంటలో మధ్యాహ్నం జరిగిన సదస్సులో భూ సమస్యలపై 12 వినతులు వచ్చాయి. తహసీల్దారు సురేష్‌బాబు దరఖాస్తులను పరిశీలించారు. త్వరగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

వరదయ్యపాళెం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ ప్రాంతంలో సరిహద్దులు దాటుతున్న మూడు ఇసుక ట్రాక్టర్లను శ్రీసిటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఉదయం నాయుడుపేట నుంచి తమిళనాడు నాయుడు కుప్పం వైపు ఇసుక ట్రాక్టర్లు వెళుతున్నాయని పోలీసులకు సమాచారం అందింది. దీంతో శ్రీసిటీ పరిసరాల్లో నిఘా పెట్టారు. రికార్డులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. ఉల్లిపాయల సురేష్, గుంజు సుధాకర్, కాకుల మహేంద్ర, మల్లి వెంకటేశులు, వెంకటసాయిని అదుపులోకి తీసుకున్నారు. ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

తల్లిదండ్రులకు, టీచర్లకు మధ్య సమన్వయం ఉండాలి

పిచ్చాటూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సమన్వయంతో పిల్లలు విద్యలో రాణిస్తారని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. శనివారం పిచ్చాటూరులోని జడ్పీ హైస్కూలులో జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము నేలపైనే అక్షరాలు దిద్ది నేర్చుకున్నామని గుర్తుచేశారు. నేడు ఆ పరిస్థితి లేదని అన్ని వసతులూ ఉన్నాయని బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ వినాయకం, ఎంఈవోలు హేమమాలిని, యుగంధర్‌రాజు, హెచ్‌ఎం గిరిప్రకాష్, విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తది తరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే ఉత్తమ ఫలితాలు

వరదయ్యపాళెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తమ పిల్లల చదువులో సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా తల్లిదండ్రులు సహకారం అందించాలని ఎంఈవో సరస్వతి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. వరదయ్యపాళెం, బత్తలవల్లం ఉన్నత పాఠశాలలో తల్లులకు ముగ్గులపోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. జడ్పీటీసీ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, పీఈటీ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో ప్రజల వద్దకే పాలన

శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా భూసమస్యలతో అల్లాడిపోతున్న రైతుల కోసం సీఎం చంద్రబాబు రెవెన్యూ సదస్సులతో ప్రజల వద్దకే పాలన తీసుకు వచ్చారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం వెల్లంపాడులో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో భూకబ్జాలు ఎక్కువగా జరగడంతో సమస్యలు పెరిగిపోయాయన్నారు. నియోజకవర్గంలో రైతుల సమస్యలను పరిష్కరించడండపై తాను ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. అనంతరం రైతుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, ఈశ్వరరెడ్డి, పాపిరెడ్డి, జగన్నాథంనాయుడు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి న్యాయవాదులు చొరవ చూపాలి

శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయవాదులు చొరవ తీసుకోవాలని శ్రీకాళహస్తి న్యాయస్థానం 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ కోరారు. పట్టణంలోని న్యాయస్థాన భవనంలో న్యాయమూర్తి ఆధ్వర్యంలో న్యాయవాదుల సమావేశం జరిగింది. న్యాయవాదులు పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీదారాఅ సులభంగా పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు.

పరశురామేశ్వరుడి సేవలో మినిస్టర్ ఆఫ్ కమ్యూనికేషన్ జీఎం

ఏర్పేడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరస్వామిని శనివారం ఏపీ మినిస్టర్ ఆఫ్ కమ్యూనికేషన్ ఫైనాన్స్ జీఎం నరేంద్ర కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

విజయసాయిరెడ్డీ నోరు అదుపులో పెట్టుకో: టీడీపీ


మాట్లాడుతున్న రెడ్డివారి గురవారెడ్డి

శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎంపీ విజయసాయిరెడ్డీ నోరు అదుపులో పెట్టుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు హయాంలోనే కాకినాడ పోర్టును వెంకటేశ్వరరావుకు ఇచ్చారని చెప్పడం సరికాదన్నారు. తాము అధికారంలోకి వస్తే చంద్రబాబు బతికి ఉంటే అరెస్టు చేయిస్తాం అని చెప్పడం గర్హనీయమన్నారు. మరోసారి ఇలా మాట్లాడితే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చ రించారు. విజయసాయిరెడ్డి పాపాలు పండాయని త్వరలోనే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో రవి యాదవ్, మునిరెడ్డి, వెంకటేశ్వరచౌదరి పాల్గొన్నారు.

శనీశ్వరుడికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వర స్వామికి శనివారం ఆగమోక్తంగా పూజలు, అభిషేకాలు చేశారు. స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

ఏర్పేడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని ఏర్పేడు తహసీల్దారు భార్గవి సూచించారు. మండలంలోని చింతలపాళెం పంచాయతీలో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. పంచాయతీ నుంచి 26మంది రైతులు వివిధ సమస్యలపై అర్జీలను సమర్పించారు. అర్జీలను పరిశీలించి పరిష్కారానికి కృషిచేస్తామని హామీఇచ్చారు.

కేవీబీపురం: దిగువపుత్తూరు రెవెన్యూలో భూ సమస్యలపై 39 అర్జీలు అందాయని తహసీల్దారు మునిరత్నం తెలియజేశారు. శనివారం మండలంలోని దిగువపుత్తూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, నాయకులు రామాంజులనాయుడు, గోపీనాథరెడ్డి, మునస్వామి యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రూట్స్‌డే

శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోనిముత్యాలమ్మగుడివీధిలో గల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో శనివారం ఘనంగా ఫ్రూట్స్‌డే వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు పలురకాల పండ్లను తీసుకొచ్చారు. కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పండ్లు ఆరోగ్యానికి చాలా మంచిదని వాటిని బాగా తినాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, జీవి, ముస్కాన్, సుమతి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం

ఏర్పేడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలోని నాగంపల్లి వద్ద ఉన్న ఎస్‌వీఎస్‌లో హరీష్(9) అనే బాలుడు అదృశ్యమయ్యాడు. బంగారుపాళెం మండలం బలిజ పల్లెకు చెందిన హరీష్ గత నెల 17వ తేదీన చేరాడు. ఈ నెల 4వ తేదీ నుంచి కనబడలేదని ఎస్‌వీఎస్ అధికారులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పైపులైన్ తవ్వకాలకు అనుమతులు రద్దు

వరదయ్యపాళెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏజీపీ సిటీ గ్యాస్ కంపెనీ వారు గ్యాస్‌పైపు లైన్ కోసం తవ్వకాలు చేపట్టారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపట్టడంతో రోడ్లు భవనాలశాఖ అధికారులు అనుమతులు రద్దు చేశారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కేవీబీపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరులో స్థానిక పెద్ద చెరువు గట్టు పక్కనే ఉన్న రోడ్డు దెబ్బతినడంతో శనివారం ఎంపీడీవో రాధారాణి ఆ రోడ్డు పనులను ప్రారంభించారు. రూ.10లక్షల వ్యయంతో నిర్మించే ఈ సీసీ రోడ్డు స్థానిక సాయిబాబా ఆలయం నుంచి ఎస్‌ఎల్‌పురం రోడ్డుతో అనుసంధానం అవుతుందని వివరించారు. నాయకులు రామాంజులనాయుడు, గోపీనాథరెడ్డి, సురేష్‌రెడ్డి, బాబు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాల ధ్వంసం అనాగరిక చర్య

శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శిలాఫలకాలను ధ్వంసం చేయడం అనాగరిక చర్య అని శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని నంది సర్కిల్ వద్ద, హరహర తీర్థం వద్ద, శివయ్య సర్కిల్ వద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకాలను ధ్వంసం చేశారన్నారు. ఈవో స్పందించి వాటిని తిరిగి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అందుబాటులో పండ్ల మొక్కలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలంలో నిర్వహిస్తున్న ఉద్యాన నర్సరీని శనివారం జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన మామిడి, కొబ్బరి మొక్కలు పంపిణీకి అందు బాటులో ఉన్నట్లు తెలిపారు. మామిడి మొక్కలు రూ.45, కొబ్బరి మొక్కలు రూ.60గా ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 7995086968, 9100411321 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి


తహసీల్దార్‌కు అర్జీలు ఇస్తున్న ప్రజలు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఇరవై సంవత్స రాలుగా సాగు చేసుకుంటున్న తమ భూములకు పట్టాలి వ్వాలని పుత్తేరి కి చెందిన 18 మంది రైతులు కోరారు. ఈ మేరకు పుత్తేరిలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఎస్సీలు, బీసీలు తహసీల్దార్ సుబ్ర మణ్యానికి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ తానని తహసీల్దార్ తెలిపారు. రెవెన్యూ సదస్సులో భూములకు సంబ ంధించి 37 అర్జీలు వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, సీనియర్ అసిస్టెంట్ నల్లయ్య, సర్పంచ్ రామ్మూర్తి, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో తల్లిపై కత్తితో దాడి

ఏర్పేడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తల్లిపై కొడుకు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటన ఏర్పేడు మండలంలోని దుర్గిపేరి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. దుర్గిపేరి గ్రామానికి చెందిన కైలాసం సుబ్రహ్మణ్యం కొద్దిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం కూడా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. భార్య, తల్లి ప్రశ్నించడంతో ఇంట్లో ఉన్న కత్తి తీసుకుని తల్లి శాంతమ్మపై దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె తీవ్ర గాయాలపాలైంది. గ్రామస్థులు ఆమెను తిరుపతి రుయాకు తరలించారు. ఏర్పేడు సీఐ జయచంద్ర సిబ్బందితో వచ్చి శాంతమ్మ కుమారుడిని అదుపులోకి తీసుకున్నారు.

విద్యను మించిన ఆస్తి లేదు



విద్యాసామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి,
తొండమనాడు పాఠశాలలో సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యను మించిన ఆస్తి లేదని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. తొట్టంబేడు మండలంలోని పెద్దకన్నలి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ భావి తరాలను సంపూర్ణ విద్యావంతులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏపీలో ఇలాంటి సమావేశం నిర్వహిస్తుండటం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్యనాయుడు, మురళీనాయుడు, ప్రతాప్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు. ● ఇక పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోనూ మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమలో డీఎస్పీ నరసింహమూర్తి, ప్రిన్సిపాల్ ప్రభావతి పాల్గొన్నారు. తొట్టంబేడు మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఇక పట్టణంలోని జడ్పీ బాలుర, బాలికల ఉన్నతపాఠశాలలు, పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లోనూ సమావేశాలు నిర్వహించారు.

అవగాహన ఉండాలి

ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య అవగాహన ఉంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. తొండమనాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ వెంకటేశ్వర్ మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాన్ని ప్రారంభించారు. పాఠశాలలో అదనపు గదులు, ఆర్వోప్లాంటు, క్రీడామైదానాన్ని మంజూరు చేయాలని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డికి కలెక్టర్ సూచించారు. హాస్టల్‌వసతితో పాటు జూనియర్ కళాశాల ఏర్పాటు అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈవో కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమసాధికార అధికారి చెన్నయ్య, డీఎంహెచ్‌వో శ్రీహరి, ఎంఈవో భువనేశ్వరి, ఎంపీడీవో రఫీ, హెచ్‌ఎం కృష్ణయ్య టీడీపీ మండల అధ్యక్షుడు కామేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం


పల్లం పాఠశాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు భార్గవి

ఏర్పేడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేద్దామని పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కలయికతో పేరెంట్స్ సమావేశాన్ని ప్రతిష్ఠాత్మకంగా శనివారం మండంలోని అన్ని పాఠ శాలలో ఏర్పాటు చేశారు. ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పేరెంట్స్ సమా వేశానికి ఎంపీడీవో సౌభాగ్యం, సీఐ జయచంద్ర ముఖ్యఅతిధులుగా హాజరై విద్యార్థులు పలు సూచనలు, సలహాలు అందించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. శ్రీనివాసపురం పంచాయతీలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన పేరెంట్స్ సమావేశానికి ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షులు నైనారు పొన్నారావు హాజరయ్యారు. బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి పాల్గొని విద్యార్థులకు సూచనలు అందజేశారు. మేర్లపాక ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయ కుడు రమణయ్య పాల్గొన్నారు. ఆయా పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తహసీల్దారు భార్గవి, టీడీపీ నాయకులు కృష్ణప్ప మొదలియార్, అంబేడ్కర్ స్టార్ కృష్ణ, అర్జున్‌బాబు, పాపానాయుడుపేట సర్పంచ్ లత పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం పెట్టాలి

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టకపోతే వార్డెన్, ప్రిన్సిపాల్, సిబ్బందిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎంఈవో మునిసుబ్రమణ్యం హెచ్చరించారు. మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శనివారం పరిశీలిం చారు. భోజనం రుచి చూసి పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టల న్నారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులు భాగం కావాలి

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభి వృద్ధిలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని విశ్రాంత ఎస్పీ రమేష్ నాయుడు తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు పండగ వాతవరణంలో శనివారం నిర్వహించారు. తల్లిదండ్రులకు మహిళలకు ముగ్గుల పోటీలు, పురుషులకు, అధికారులకు టగ్ ఆఫ్ వార్ నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్ర మణ్యం, ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు, ఎంఈవో మునిసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, రూపేష్ కుమార్, మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

లారీ బోల్తా

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీకాళహస్తి-తడ రోడ్డు పార్లపల్లి గ్రామ మలుపు దగ్గర శ్రీకాళహస్తి నుంచి తడకు వెళుతున్న ఖాళీ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 ద్వారా శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గోవర్ధనపురం వంతెనకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి


నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గుంతలతో రాక పోకలకు నరకప్రాయంగా మారిన గోవర్ధనపురం వంతెన ఆధునీకరణకు వెంటనే ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదేశించారు. ఇటీవల వరదలకు కోతకు గురైన వరదయ్యపాళెం పంచాయతీ గోవర్ధనపురంలోని మారేడుకాలువపై ఉన్న వంతెనను శనివారం ఆయన పరిశీలించారు. అధ్వానంగా మారిన వంతెనకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఆధునీకరణకు ప్రతిపాదనలు పంపితే తాను నిధులు మంజూరు అయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. అనంతరం కంచరపాళెం ఇటీవల మృతిచెందిన సీనియర్ నాయకుడు బందిల బాలయ్య కుటుంబాన్ని పరామర్శించారు. రాచ కండ్రిగలో మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు నాగరాజు యాదవ్ తల్లి ఇటీవల మృతి చెందడంతో ఆయనను పరామర్శించారు.

గిరిజనులకు నిత్యావసరాల పంపిణీ

ఇటీవల వరదలకు అరుణానది ప్రవాహంతో జల దిగ్బంధంలో చిక్కుకుని ఉపాధి కోల్పోయిన పాండూరు పంచాయతీ వెంకటేశ్వర గిరిజనకాలనీ వాసులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. నాయకులు జయశంకర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, నిర్మల, దశరథన్ జయచంద్రనాయుడు, నరసరాజు. నాగరాజుయాదవ్, నందకిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.